teenmaardesk@gmail.com

RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...

తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 04 | సంచిక : 76 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | గురువారం | 21 ఆగస్టు 2025 | పేజీలు : 08 | వెల ‚ 5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad.


## ఇంటర్ అడ్మిషన్ల దరఖాస్తు గడువు పెంపు

### ఈ మేరకు బోర్డు ఉత్తర్వులు జారీ

### ఆగస్టు 31 వరకు పెంచుతున్నట్లుగా వెలువడిన సర్క్యులర్

హైదరాబాద్, ఆగస్టు 20 (తీన్మార్ న్యూస్): పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులై ఇంటర్మీడియట్‌లో చేరే విద్యార్థినీ విద్యార్థులకు ఇంటర్ బోర్డు తీపికబురు చెప్పింది. ఈ మేరకు ఇంటర్ అడ్మిషన్ల దరఖాస్తు గడువు పెంచుతూ బుధవారం మరోసారి ఉత్తర్వులు జారీ చేసింది. ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్ల కోసం అప్లికేషన్ల గడువును ఆగస్టు 31 వరకు పెంచుతున్నట్లుగా సర్క్యులర్ వెలువడింది. ఇంటర్ బోర్డు అఫిలియేషన్ ఉన్న కళాశాలల్లో మాత్రమే అడ్మిషన్లు తీసుకోవాలని బోర్డు అధికారుల విద్యార్థులు తల్లిదండ్రులకు సూచించారు. ఇంటర్ బోర్డు అధికారిక వెబ్‌సైట్‌లో అనుబంధ గుర్తింపు ఉన్న ఇంటర్ కళాశాల జాబితా అందుబాటులో ఉంటుందని బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ సెక్రటరీ కృష్ణ ఆదిత్య వెల్లడించారు.



## కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే హైటెక్స్ సిటీకి పునాది రాయి

రూ.లక్షల కోట్ల ఆదాయం రావడంలో ఐటీదే కీలక పాత్ర

ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి శంకుస్థాపన

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వాఖ్యలు

.. వివరాలు 2లో



## విలువైన భూముల వేలానికి ప్రభుత్వం సిద్ధం

హెచ్ఎండిఏ నోటిఫికేషన్ విడుదల

తుర్కయాంజాల్, బాచుపల్లిలో ప్లాట్ల వేలం

సెప్టెంబర్ 16 నుంచి 18 వరకు ఈ-వేలం తేదీలు

.. వివరాలు 2లో



# మద్యం దుకాణాలకు టెండర్ల నోటిఫికేషన్

### గౌడ, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు లాటరీ ద్వారా ఆశావహులకు షాపుల కేటాయింపు

డిసెంబర్ 1, 2025 నుంచి లైసెన్స్ కాలం ప్రారంభం

జనాభా ఆధారంగా ఆరు శ్లాబ్‌లలో లైసెన్స్ ఫీజు

పెరిగిన దరఖాస్తు రుసుము

నగరాలు, గ్రామీణ ప్రాంతాలకు వేర్వేరు సమయాలు

ఒకే వ్యక్తికి ఒకటి కంటే ఎక్కువ దరఖాస్తులకు అవకాశం

02



ఆశావాహులకు తెలంగాణ సర్కార్ గుడ్ న్యూస్ చెప్పింది. 2025-2027 సంవత్సరానికి గాను రాష్ట్ర వ్యాప్తంగా మద్యం షాపుల టెండర్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తూ బుధవారం ఎక్సైజ్ శాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. లిక్కర్ షాపు కోసం కనీస దరఖాస్తు రుసుము రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలకు పెంచారు.

# మాకు ఢిల్లీలో బాస్‌లు లేరు

రెండు లక్షల టన్నుల ఎరువులు ఇస్తే వారికే మద్దతు

ఎన్‌డీఏ, ఇండియా కూటములలో బీఆర్ఎస్ లేదు

రేవంత్ రెడ్డి పెట్టిన అభ్యర్థిని ఖచ్చితంగా వ్యతిరేకిస్తాం

ఉపరాష్ట్రపతి ఎన్నికపై కేటీఆర్ కీలక వ్యాఖ్యలు



హైదరాబాద్, ఆగస్టు 20 (తీన్మార్ న్యూస్): ఉపరాష్ట్రపతి ఎన్నికలో బీఆర్ఎస్ మద్దతుపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల విషయంలో రెండు కూటమి పార్టీలు అభ్యర్థులను ప్రకటించాయని వెల్లడించారు. కానీ బీఆర్ఎస్

మిగతా 2 లో

## రాష్ట్రంలో ఎరువుల కొరత

రైతుల కష్టాలు ప్రభుత్వానికి కనిపించడం లేదు

పదేళ్ల కేసీఆర్ పాలనలో ఈ పరిస్థితి లేదు

వ్యవసాయ శాఖపై సమీక్ష నిర్వహించని రేవంత్ రెడ్డి

ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తున్నవారిపై కేసులు

ప్రభుత్వ చేతకానితనం వల్లే ఈ దుస్థితి- కేటీఆర్

02

## విద్యుత్‌శాఖ వర్సెస్ కేబుల్ ఆపరేటర్లు

### విద్యుత్ స్తంభాలపై భారీగా కేబుల్స్ తొలగింపు

తీవ్ర ఇబ్బందుల్లో ఇంటర్నెట్ ప్రొవైడర్లు

వైర్ల తొలగింపు ఆపకపోతే ఆందోళనకు దిగుతాం

ప్రభుత్వాన్ని హెచ్చరించిన కేబుల్ ఆపరేటర్లు

02





## సమ్మక్క సారలమ్మ జాతరకు రూ.150 కోట్లు

ఆర్థిక శాఖ అనుమతులిస్తూ ఉత్తర్వులు విడుదల

వీఐపీల కోసం రూ.5 కోట్లతో గెస్ట్ హౌస్ నిర్మాణం

కోట్లాది భక్తులకు మెరుగైన సౌకర్యాల లక్ష్యంగా ప్రణాళికలు

వచ్చే ఏడాది జనవరి 28 నుంచి 31న ముగియనున్న జాతర

02

## సే నో టు బెట్టింగ్ యాప్స్ ఉద్యమం ఫలించింది




02

ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల నిషేధంపై సజ్జనార్ హర్షం

కేంద్ర ప్రభుత్వ నిర్ణయం చారిత్రాత్మకం: సజ్జనార్

యువతకు బెట్టింగ్ యాప్స్‌కు దూరంగా ఉండాలని సూచన

ఆర్థిక, మానసిక బానిసత్వం నుంచి బయటపడతారని వెల్లడి

## మహిళా పోలీసులకు.. మెటర్నిటీలో మినహాయింపులు

మహిళా పోలీసులకు సౌకర్యాలు కల్పిస్తాం: సీతక్క

తెలంగాణ మహిళా పోలీస్ తొలి సదస్సులో మంత్రి సీతక్క



హైదరాబాద్, ఆగస్టు 20 (తీన్మార్ న్యూస్): కమిట్మెంట్, కాన్ఫిడెన్స్‌కు చిరునామా మహిళా పోలీసులు అని మంత్రి సీతక్క ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బుధవారం రాజేంద్రనగర్‌లోని తెలంగాణ పోలీస్ అకాడమీలో తెలంగాణ మహిళా పోలీస్ తొలి సదస్సుకు ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క హాజరై ప్రసంగించారు. మహిళా

మిగతా 2 లో

## సినీ కార్మికుల సమ్మెపై సీఎం జోక్యం

సమస్య పరిష్కరించాలని అధికారులకు ఆదేశం

17 రోజులుగా నిలిచిపోయిన షూటింగ్‌లు

సినిమా హబ్‌గా మార్చాలన్న ప్రభుత్వ లక్ష్యానికి ఆటంకం

30 శాతం వేతనాల పెంపు కోరుతున్న కార్మికులు

నష్టాల్లో ఉన్నామని చెబుతున్న నిర్మాతలు



హైదరాబాద్, ఆగస్టు 20 (తీన్మార్ న్యూస్): వేతనాలు పెంచాలని గతకొన్ని రోజులుగా సినీ కార్మికులు ఆందోళనలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఫెడరేషన్ సభ్యులు, సినీ నిర్మాతలు పలుమార్లు చర్చలు జరిపినా కూడా సఫలం కాలేదు. దీంతో

మిగతా 2 లో



## నాసిరకం మందుల తయారీదారులపై పీడీ యాక్ట్


ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

డ్రగ్ కంట్రోల్ అథారిటీ అధికారులతో మంత్రి సమీక్ష

నిబంధనలు ఉల్లంఘించిన సంస్థలను మూసివేయాలి

అవసరమైతే పీడీ యాక్ట్ నమోదు చేయాలని సూచన

02

# మద్యం దుకాణాలకు టెండర్ల నోటిఫికేషన్




తెలంగాణ బ్యూరో, ఆగష్టు 20 (తీన్మార్ న్యూస్): ఆశావాహులకు తెలంగాణ సర్కార్ గుడ్ న్యూస్ చెప్పింది. 2025- 2027 సంవత్సరానికి గాను రాష్ట్ర వ్యాప్తంగా మద్యం షాపుల టెండర్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తూ బుధవారం ఎక్సైజ్ శాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. లిక్కర్ షాపు కోసం కనీస దరఖాస్తు రుసుము రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలకు పెంచారు. ఫిక్స్‌డ్ షాప్ ఎక్సైజ్ టాక్స్ ఆధారంగా లాటరీ ద్వారా ఆశావహులకు షాపులను కేటాయించనున్నారు. లైసెన్స్ కాలం 01.12.2025 నుంచి 30.11.2027 వరకు నిర్ణయించారు. ఈసారి మద్యం షాపు కేటాయింపుల్లో గౌడ సామాజికవర్గానికి 15 శాతం, ఎస్సీ సామాజికవర్గానికి 10 శాతం, ఎస్టీ సామాజికవర్గానికి 5 శాతం షాపులను కేటాయించనున్నారు. భాగస్వామ్య సంస్థలు, కంపెనీలు దరఖాస్తు చేయడానికి అనుమతించారు. అదేవిధంగా ఒకే దరఖాస్తుదారుడు ఒక లిక్కర్ షాపునకు ఒకటి కంటే ఎక్కువ దరఖాస్తులు దాఖలు చేయవచ్చు.

**6 శ్లాబ్‌లలో లైసెన్స్‌ల జారీ ఇలా**

మొత్తం 6 శ్లాబ్‌లలో ఎక్సైజ్ శాఖ లైసెన్స్‌లను జారీ చేయనుంది. 2011 జనాభా లెక్క ప్రకారం 5 వేల వరకు జనాభా ఉన్న ప్రాంతాల్లో సంవత్సరానికి ఎక్సైజ్ ట్యాక్స్ రూ.50 లక్షలు, 5 వేల నుంచి 50 వేలు జనాభా ఉన్న పాంతాల్లో రూ.55 లక్షలు, 50 వేల నుంచి 1 లక్ష జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ.60 లక్షలు, 1 లక్ష నుంచి 5 లక్షల జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ.65 లక్షలు, 5 లక్షల నుంచి 20 లక్షల జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ.85 లక్షలు, ఇక 20 లక్షలపైన జనాభా ఉన్న ప్రాంతాల్లో సంవత్సరానికి ఎక్సైజ్ ఫీజు రూ.కోటి పది లక్షలుగా నిర్ణయించారు. అయితే, లాటరీ ద్వారా లిక్కర్ షాపులను పొందిన వారు ప్రభుత్వానికి చెల్లించాల్సిన వార్షిక ఫీజును ప్రతి ఏటా ఆరు సమాన వాయిదాల్లో చెల్లించాల్సి ఉంటుంది. 25 నెలల లైసెన్స్ కాలానికి గాను 1/4వ వంతు అంటే 25 శాతం సమానమైన బ్యాంక్ గ్యారెంటీ ప్రభుత్వానికి సమర్పించాలి. జీహెచ్ఎంసీ, నగర పంచాయతీల పరిధిలో మద్యం షాపులను ఉదయం 10 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు, గ్రామీణ ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10.00 గంటల వరకు మాత్రమే తెరిచి ఉంచేందుకు అనుమతిస్తారు.

## సే నో టు బెట్టింగ్ యాప్స్ ఉద్యమం ఫలించింది




హైదరాబాద్, ఆగష్టు 20 (తీన్మార్ న్యూస్): #SayNoToBettingApps అనే ఉద్యమం కేంద్రం ఆన్లైన్ బెట్టింగ్ యాప్ లను నిషేధించాలని నిర్ణయించడంతో విజయవంతమైందని తెలంగాణ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ అన్నారు. ఆన్లైన్ బెట్టింగ్ ను నిషేధించేలా బిల్లును తీసుకురావడంపై ఆయన ఎక్స్ వేదికగా హర్షం వ్యక్తం చేశారు.

లెక్కలేనన్ని యువ జీవితాలను నాశనం చేస్తున్న ఆన్‌లైన్ బెట్టింగ్‌ను నిషేధించాలనే కేంద్ర ప్రభుత్వం నిర్ణయం చాలా స్వాగతించదగినది. చారిత్రాత్మకమైనది. ఈ చర్య చాలా మంది ప్రాణాలను కాపాడటమే కాకుండా, జూదం వ్యసనం యొక్క ప్రమాదకరమైన పరిణామాల నుండి మన సమాజం యొక్క సామాజిక నిర్మాణాన్ని కూడా కాపాడుతుంది. గత కొన్ని నెలలుగా బెట్టింగ్ యాప్‌లు యువతపై చూపే ప్రభావానికి వ్యతిరేకంగా నేను అవిశ్రాంతంగా నా స్వరాన్ని వినిపిస్తున్నాను. భారతదేశం అంతా, విదేశాల నుండి కూడా లక్షలాది మంది ఆందోళన చెందుతున్న పౌరులు ఈ ప్రయోజనం కోసం కలిసి వచ్చిన #SayNoToBettingApps అనే ఉద్యమం ప్రారంభించబడటం గర్వకారణం. ఈ సమిష్టి పోరాటం చివరకు ఫలించింది. ఈ నిర్ణయం భారతదేశ యువతకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తుంది. మానసిక, ఆర్థిక బానిసత్వ ఉచ్చులో పడకుండా విద్య, కెరీర్ మరియు సృజనాత్మకత ద్వారా బంగారు భవిష్యత్తును నిర్మించడంపై దృష్టి పెట్టడానికి వీలు కల్పిస్తుంది. సమాజాన్ని ఆరోగ్యకరమైన, మరింత ప్రగతిశీల దిశలో నడిపించే దిశగా ఇది ఒక ప్రధాన అడుగు. యువ మిత్రులారా, నేను మరోసారి మిమ్మల్ని కోరుతున్నాను. బెట్టింగ్ యాప్‌లకు దూరంగా ఉండండి మీ శక్తి, ప్రతిభ, సమయాన్ని మీ లక్ష్యాలను సాధించడానికి ఉపయోగించుకోండి. అలా చేయడం ద్వారా, మీరు మీ స్వంత భవిష్యత్తును రూపొందించుకోవడమే కాకుండా, బలమైన, ప్రకాశవంతమైన భారతదేశానికి దోహదం చేస్తారు. అని పేర్కొన్నారు.

## మహిళా పోలీసులకు.. మెటర్నిటీలో మినహాయింపులు

మొదటి పేజీ తరువాయి



పోలీసుల సంక్షమం పట్ల ఒక కమిట్మెంట్‌గా ఈ సదస్సు నిలుస్తోందన్నారు. మహిళా శక్తినీ ప్రోత్సహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హోమ్ మినిస్టర్‌గా ఉన్నారని కొనియాడారు. ఈ సదస్సులో మీరు ఇచ్చే సలహాలు సూచనలకు అనుగుణంగా మీ సంక్షేమం కోసం సీఎం సానుకూల నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. ఈ దేశంలో మహిళా పోలీస్ సింగ్‌కు ఇందిరా గాంధీ పునాదులు వేశారని, 1973లో కేరళ రాష్ట్రం కోజికోడ్‌లో తొలి మహిళా పోలీస్ స్టేషన్ను ఇందిరా గాంధీ ప్రారంభించారని గుర్తుకుచేశారు. ఆ తర్వాత దేశవ్యాప్తంగా మహిళా పోలీస్ స్టేషన్‌లు ఏర్పాటు అయ్యాయని వివరించారు. వృత్తి ధర్మం, మాతృత్వం మధ్య మహిళా పోలీసులు సంఘర్షణలు ఎదుర్కొంటారని తెలిపారు. కాబట్టి మెటర్నిటీలో ఉన్న మహిళా పోలీసులకు కొన్ని మినహాయింపులు ఇవ్వాలని అన్నారు. మహిళలకు కొన్ని ప్రత్యేక అవసరాలు ఉంటాయి కాబట్టి వాటి దృష్టిలో పోలీస్ శాఖ మహిళలా పోలీసులకు అండగా ఉండాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌లోకి వచ్చే బాధితులకు భరోసాగా మహిళా పోలీసులు నిలవాలని సూచించారు. ప్రతి ఏడాది పోలీసులందరికీ జెండర్ సెన్సిటైజేషన్ ట్రైనింగ్ నిర్వహించాలని సూచించారు. మహిళా పోలీసులకు వీక్లీ ఆఫ్, ప్రత్యేక పని వేళల సౌకర్యాలు కల్పించే అంశాన్ని పరిశీలించాలని అధికారులకు సూచించారు. మహిళా పోలీసుల ప్రత్యేక అవసరాలపై అధ్యయనం చేసి నివేదిక ఇస్తే చట్టాలు చేస్తామని హామీ ఇచ్చారు. సైబర్ క్రైమ్, ఆన్‌లైన్ హరాస్మెంట్ వంటి కేసులలో మహిళా పోలీసులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించారు. స్ట్రెస్ మేనేజ్‌మెంట్, కౌన్సెలింగ్ ప్రోగ్రాములు మహిళా పోలీసుల కోసం తప్పనిసరిగా ఉండాలన్నారు. మెటర్నిటీ, పోస్ట్-డెలివరి కాలానికి అనువుగా తమిళనాడు తరహాలో ప్రత్యేక యూనిఫార్మ్‌లు ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఇతర రాష్ట్రాల్లో మహిళా పోలీసుల కోసం ఉన్న బెస్ట్ ప్రాక్టీసెస్‌ను స్టడీ చేసి నివేదిక ఇస్తే వాటిని అమలు పరుస్తామన్నారు. మహిళా పోలీసులకు అవసరమైన రెస్ట్ రూములు, వెల్నెస్ సెంటర్లను నెలకొల్పాలన్నారు. రాష్ట్రంలో 80 వేల మంది పోలీసులు ఉంటే అందులో మహిళా పోలీసులు కేవలం 7 వేల మంది మాత్రమే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా పోలీసుల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. మహిళా పోలీస్ ఎదుర్కొంటున్న సమస్యలు సవాళ్లను అధిగమించేలా ఈ సదస్సు ఉపయోగపడుతుందన్న నమ్మకం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ జనరల్ పోలీస్ అధికారులు అభిలాష బిస్త్, చారు సిన్హా, శికా గోయల్, స్వాతి లక్రా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కాగా, కానిస్టేబుల్ నుంచి ఎస్పీ వరకు 400 మంది మహిళా పోలీస్ అధికారులు ఈ సదస్సుకు హాజరయ్యారు.

## విద్యుత్ శాఖ వర్సెస్ కేబుల్ ఆపరేటర్లు



హైదరాబాద్, ఆగష్టు 20 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్‌లో ఇటీవల రామాంతాపూర్, బండ్లగూడ, తదితర ప్రాంతాల్లో విద్యుత్ షాక్‌ల కారణంగా ప్రజలు మరణించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు విద్యుత్ స్తంభాలపై అనుమతి లేని ఇంటర్నెట్, ఇతర కేబుల్స్‌ను భారీగా అధికారులు తొలగించారు. ఈ చర్యలతో ప్రజలు, ఇంటర్నెట్ ప్రొవైడర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో నగరంలో విద్యుత్ శాఖ వర్సెస్ కేబుల్ ఆపరేటర్లుగా మారింది. వైర్ల తొలగింపు ఆపకపోతే ఆందోళనకు దిగుతామని కేబుల్ ఆపరేటర్లు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ నేపథ్యంలోనే బుధవారం మరోసారి టీజీ ఎస్పీడీసీఎల్ సీఎండీతో కేబుల్ ఆపరేటర్ల జేఏసీ నేతలు చర్చలు జరిపారు. అనంతరం ఈ సమావేశంపై టీజీ ఇంటర్నెట్ ప్రొవైడర్ ప్రెసిడెంట్ సతీష్‌బాబు మీడియాతో మాట్లాడుతూ టీజీ ఎస్పీడీసీఎల్ సీఎండీతో కేబుల్ ఆపరేటర్లు చర్చలు సఫలం అయినట్లు క్లారిటీ ఇచ్చారు. కేబుల్, ఇంటర్నెట్ వైర్లను కట్ చేయొద్దనే డిమాండ్‌కు ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని వెల్లడించారు. రన్నింగ్‌లో ఉన్న కేబుల్, ఇంటర్నెట్ వైర్లను ఒకే బంచింగ్ విధానంలో తీసుకురావాలని చెప్పినట్లు వెల్లడించారు. నగర సుందరీకరణకు మేము కూడా అంగీకరిస్తామని టీజీ ఇంటర్నెట్ ప్రొవైడర్ ప్రెసిడెంట్ సతీష్‌బాబు తెలిపారు.

## కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే హైటెక్స్ సిటీకి పునాది రాయి




హైదరాబాద్, ఆగష్టు 20 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్ మహానగరాభివృద్ధిలో చాలా మంది ప్రముఖుల పాత్ర ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన గచ్చిబౌలిలోని ఇంటిగ్రేటెడ్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్ఫోసిస్, మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటి సంస్థలు ఇక్కడి నుంచే పని చేయడం మనందరికీ గర్వకారణమని అన్నారు. చంద్రబాబు, వైఎస్ఆర్‌లు కూడా హైదరాబాద్ అభివృద్ధికి కృషి చేశారని గుర్తు చేశారు. ఇక దేశంలో ఐటీ పరిశ్రమ అభివృద్ధి వెనుక స్వర్గీయ రాజీవ్ గాంధీ పాత్ర కూడా ఉందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే హైటెక్స్ సిటీకి పునాది రాయి పడిందని, ఆ తరువాత దాని నిర్మాణాన్ని చంద్రబాబు కొనసాగించారని గుర్తు చేశారు. మూసీ ప్రక్షాళన, ఫ్యూచర్ సిటీ కొందరికి నచ్చడం లేదు.

నేడు రాష్ట్రాలకు రూ.లక్షల కోట్ల ఆదాయం రావడంలో ఐటీదే కీలక పాత్ర అని కొనియాడారు. అటు అమెరికాలో కూడా సిలికాన్ వ్యాలీని తెలుగు వాళ్లు శాసిస్తున్నారని తెలిపారు. తెలుగు వాళ్లు లేకపోతే అమెరికా ఐటీ కంపెనీలు నడిచే పరిస్థితి లేదన్నారు. హైదరాబాద్ నగరాన్ని విశ్వ నగరంగా మార్చుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. న్యూయార్క్, టోక్యో, సింగపూర్‌లతో హైదరాబాద్‌కు పోటీగా నిలబెట్టాలని తెలిపారు. కానీ, మూసీ ప్రక్షాళన ఫ్యూచర్ సిటీ కొందరికి నచ్చడం లేదని కామెంట్ చేశారు. ఆనాడు కూడా హైటెక్స్ సిటీని కొందరు అవహేళన చేశారని ఔటర్ రింగ్ రోడ్డు ఎందుకు, ఊరు చివర ఎయిర్‌పోర్టా అంటూ కామెంట్లు చేశారని గుర్తు చేశారు.

**మూసీ మురికిలో బతకాలని ఎవరు కోరుకుంటారు.**

నాటి ప్రభుత్వాలు అభివృద్ధి చేయబట్టే నేడు హైదరాబాద్ ఈ స్థాయిలో ఉందని అన్నారు. గతంలో హైదరాబాద్ వేదికగా ఎన్నో అందర్జాతీయ క్రీడలు నిర్వహించామని తెలంగాణ రైజింగ్ నినాదంతో హైదరాబాద్ మహానగరాన్ని అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. ఓల్డ్ సిటీని గోల్డ్ సిటీగా మార్చాలంటే మూసి ప్రక్షాళన జరగాల్సిందేనని నినదించారు. మూసీ మురికిలో బతకాలని ఎవరు కోరుకుంటారని రాజీవ్ స్వగృహ ద్వారా పేదల సొంతింటి కలను నిజం చేస్తామని అన్నారు. ప్రపంచ స్థాయి నగరంలో ఆ స్థాయిలో ప్రభుత్వ కార్యాలయాలు లేవని సర్కార్ కార్యాలయాలను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. నేటికీ ప్రభుత్వానికి ఎంతో ఆదాయం తెచ్చిపెట్టే సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులు కూడా సరిగా లేకపోవడం శోచనీయమని తెలిపారు. 8 నెలల వ్యవధిలో గచ్చిబౌలిలో సమీకృత సబ్ రిజిస్ట్రార్ ఆఫీసును అంతర్జాతీయ స్థాయిలో నిర్మాణాన్ని పూర్తి చేస్తామని పేర్కొన్నారు. నగర అభివృద్ధిని అడ్డుకునే వారు మనకు శత్రువులేనని అలాంటి దొంగల పని పట్టాల్సింది ప్రజలేనని రేవంత్ రెడ్డి అన్నారు.

## నాసిరకం మందుల తయారీదారులపై పీడీ యాక్ట్



హైదరాబాద్, ఆగష్టు 20 (తీన్మార్ న్యూస్): డ్రగ్ కంట్రోల్ అథారిటీ అధికారులతో ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా సమీక్ష నిర్వహించారు. 2024 & 2025లో డీసీఏ వర్క్ ప్రోగ్రెస్‌ను మంత్రికి డీసీఏ డైరెక్టర్ జనరల్ షానవాజ్ ఖాసీం వివరించారు. 2024లో 25,939 తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన 4142 సంస్థలపై చర్యలు తీసుకున్నామని తెలిపారు. 2025లో జనవరి నుంచి జూలై వరకు 16,481 తనిఖీలు చేశామని, నిబంధనలు ఉల్లంఘించిన 2827 సంస్థలపై చర్యలు తీసుకున్నామన్నారు. 2024 జనవరి నుంచి 2025 జూలై వరకు 7200 మెడిసిన్ సాంపిల్స్‌ను టెస్ట్ చేయగా, అందులో 186 నాసిరకం మెడిసిన్‌గా తేలిందని, సంబంధిత సంస్థలపై చట్టప్రకారం చర్యలు తీసుకున్నామన్నారు. సుమారు 700 కేసులు బుక్ చేశామని వివరించారు. ప్రతి కేసులోనూ దోషులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. జనాలను తప్పుదోవ పట్టించే ప్రకటనలు ఇస్తూ, మెడిసిన్ అమ్మకాలు జరుపుతున్న కంపెనీలు, వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. స్పూరియస్, నాట్ స్టాండర్డ్ డ్రగ్స్ తయారు చేస్తున్న ఫార్మా కంపెనీలు, డిస్ట్రిబ్యూటర్లు, అమ్మకందారులపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. మెడిసిన్ అనేది ప్రజల ప్రాణాలతో ముడిపడి ఉన్న అంశం అని, ఈ విషయంలో ఎలాంటి ఉపేక్ష పనికిరాదన్నారు. పదే పదే నిబంధనలు ఉల్లఘింస్తున్న సంస్థలను చట్టప్రకారం పర్మినెంట్‌గా క్లోజ్ చేయాలని ఆదేశించారు. నకిలీ, నిషేధిత మందుల తయారీ, అమ్మకం దారులపై అవసరమైతే పీడీ యాక్ట్ నమోదు చేయాలని మంత్రి ఆదేశించారు. మెడిసిన్‌ను ఆహార పదార్థాలుగా చూపిస్తూ, వాటి తయారీ, అమ్మకాలు చేపడుతున్నవారిపై చర్యలు తీసుకోవాలన్నారు. యాంటిబయాటిక్ రెసిస్టెన్స్ అనేది పెద్ద ముప్పుగా పరిణమిస్తోందని, నిబంధనలు ఉల్లంఘించి యాంటిబయాటిక్స్ అమ్మకాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. డాక్టర్ల ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు ప్రేరేపిత మెడిసిన్ అమ్మకాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డీసీఏ డీజీని మంత్రి ఆదేశించారు. డ్రగ్ టెస్టింగ్ ల్యాబ్ అప్‌గ్రెడేషన్ పనులను స్పీడప్ చేయాలని మంత్రి ఆదేశించారు. త్వరలో మరిన్ని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులను మంజూరు చేసి, రిక్రూట్ చేస్తామని తద్వారా డ్రగ్ కంట్రోల్ అథారిటీని మరింత బలోపేతం చేస్తామని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. ప్రజలకు క్వాలిటీ మెడిసిన్, క్వాలిటీ ఫుడ్ అందించే విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని మంత్రి స్పష్టం చేశారు.



## మాకు ఢిల్లీలో బాస్‌లు లేరు

మొదటి పేజీ తరువాయి

పార్టీ సర్వ స్వతంత్ర్యమైన పార్టీ అని స్పష్టం చేశారు. మాకు ఢిల్లీలో బాస్‌లు లేరు. ఏ పార్టీ కూడా మాకు బాస్‌లు కారు. మాకు తెలంగాణ ప్రజలే బాస్‌లు తప్ప మాకు ఢిల్లీలో పెద్దలు, ఆదేశించేవారు ఎవరూ లేరు అని కేటీఆర్ తెలిపారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల విషయంలో మాకు ఏ పార్టీ, అభ్యర్థులు కానీ మమ్మల్ని సంప్రదించలేదని క్లారిటీ ఇచ్చారు. ఉపరాష్ట్రపతి ఎన్నిక జరుగుతోందని, కేవలం మీడియాలో చూసేదాకా తెలియదన్నారు. ఎన్నికపై మమ్మల్ని ఎవరూ కూడా సంప్రదించలేదు. ఎన్నికకు ఇంకా టైమ్ ఉంది కాబట్టి బీఆర్ఎస్ నేతలు కలిసి ఆలోచించుకొని ఎలక్షన్ సమయానికి మా వైఖరి ప్రకటిస్తామని స్పష్టం చేశారు. మేము ఎన్‌డీఏ కూటమీలో లేము, ఇండియా కూటమిలో లేము అని కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎవరికి సపోర్ట్ చేయాలనే దానిపై కూడా మాకు ఢిల్లీ నుంచి ఎలాంటి ఒత్తిడి లేదన్నారు. నరేంద్ర మోడీ, రాహుల్‌గాంధీ మా బాస్‌లు కాదన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, ఇక్కడి ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా మద్దతుపై నిర్ణయం తీసుకుంటామని, ప్రస్తుతానికి ఏ నిర్ణయం తీసుకోలేదని క్లారిటీ ఇచ్చారు. అలాగే రేవంత్ రెడ్డి పెట్టిన అభ్యర్థి అయితే కచ్చితంగా వ్యతిరేకిస్తామని విమర్శించారు. కాంగ్రెస్ అనేది ఒక చిల్లర పార్టీ అని అలాంటి ముఖ్యమంత్రి పెట్టిన అభ్యర్థిని మేము సమర్థిస్తామని ఎలా అనుకుంటారని తీవ్ర విమర్శలు గుప్పించారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల విషయంలో డ్రామా జరుగుతోందన్నారు. బీసీల విషయంలో మా పార్టీ చిత్తశుద్ధి ఉందని చెప్పి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా బీసీని ఎందుకు పెట్టలేదు అని ప్రశ్నించారు. బీసీలపై ప్రేమ ఉంటే తెలంగాణ నుంచి ఒక్క బీసీ అభ్యర్థి దొరకలేదా? అని నిలదీశారు. సామాజిక వేత్త కంచె ఐలయ్యను అభ్యర్థిగా పెట్టి మీ చిత్తశుద్ధి నిరుపించుకోవాల్సిందని సూచించారు. బీసీ అభ్యర్థులను పెట్టరు. కానీ మీ మాటలు మేము నమ్మాలా? అని ప్రశ్నించారు. రెండు పార్టీలు దొందూ దొందే వారు తెలంగాణకు ఏమి చేయలేదన్నారు. కాబట్టి సెప్టెంబర్ 9 లోపు రెండు లక్షల టన్నుల ఎరువులు ఎవరు తీసుకొచ్చి పెడితే ఆ పార్టీ ఉపరాష్ట్రపతి అభ్యర్థికే బీఆర్ఎస్ సానుకూలంగా ఉంటుందని కేటీఆర్ తేల్చి చెప్పారు.

## రాష్ట్రంలో ఎరువుల కొరత

హైదరాబాద్, ఆగష్టు 20 (తీన్మార్ న్యూస్): తెలంగాణ వ్యాప్తంగా యూరియా కోసం రైతులు ఎంతో ఇబ్బంది పడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బుధవారం నందినగర్‌లోని నివాసం వద్ద కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ చేతగానితనం వల్లే రాష్ట్రంలో ఈ దుస్థితి వచ్చిందని అన్నారు. ఎరువుల బస్తాల కోసం రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. గత పదేళ్ల కేసీఆర్ పాలనలో ఏనాడూ ఈ దుస్థితి రాలేదని అన్నారు. కేసీఆర్ పాలనలో ఎరువులు బఫర్ స్టాక్ పెట్టేవాళ్లమని గుర్తుచేశారు. రెండు నెలలుగా తెలంగాణలో దయనీయమైన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. రైతుల కష్టాలు ప్రభుత్వానికి కనిపించడం లేదని చిల్లర రాజకీయాలు చేయడం మాత్రమే తెలుసని సీరియస్ కామెంట్స్ చేశారు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తున్న వారిపై కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆరోపించారు. పదేళ్లు ఏ కష్టం తెలియకుండా రైతులను కేసీఆర్ కాపాడుకున్నారని కాంగ్రెస్ ప్రభుత్వంతో పాటు మళ్లీ కష్టాలు కూడా రైతులకు వచ్చాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు రెండేళ్లు కావస్తున్నా ఇప్పటివరకు వ్యవసాయ శాఖపై సీఎం రేవంత్ రెడ్డి ఒక్క సమీక్ష కూడా చేయలేదు అంటే రైతులపై, వ్యవసాయ శాఖపై వారికి ఎంత చిత్తశుద్ధి ఉందో అందరూ అర్థం చేసుకోవాలని కోరారు.

## విలువైన భూముల వేలానికి ప్రభుత్వం సిద్ధం

రంగారెడ్డి, ఆగష్టు 20 (తీన్మార్ న్యూస్): ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో విలువైన భూముల వేలానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైంది. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ తాజాగా ఈ-వేలం కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది. నోటిఫికేషన్ ప్రకారం, రంగారెడ్డి జిల్లాలోని తుర్కయాంజాల్ లేఅవుట్‌లో మొత్తం 12 ప్లాట్లు, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని బాచుపల్లి లేఅవుట్‌లో 70 ప్లాట్లు, అలాగే రంగారెడ్డి జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో 4 ప్లాట్లు, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో మరో 7 ప్లాట్లు వేలం ద్వారా అమ్మకానికి ఉంచనున్నట్లు హెచ్ఎండీఏ ప్రకటించింది. ఈ వేలం తేదీలను కూడా స్పష్టంగా ప్రకటించారు. తుర్కయాంజాల్ లేఅవుట్‌లో సెప్టెంబర్ 16, బాచుపల్లి లేఅవుట్‌లో సెప్టెంబర్ 17, ఇతర ప్రాంతాల్లో సెప్టెంబర్ 18న వేలం జరగనుంది. రిజిస్ట్రేషన్ కోసం కూడా అదే తేదీలను చివరి గడువుగా నిర్ణయించారు. ఈ భూముల వేలం ద్వారా ప్రభుత్వానికి మంచి ఆదాయం రాబట్టడంతో పాటు, పెట్టుబడిదారులకు ఆకర్షణీయమైన అవకాశాలు లభించే అవకాశముంది.

## సమ్మక్క సారలమ్మ జాతరకు రూ.150 కోట్లు



తెలంగాణ బ్యూరో, ఆగష్టు 20 (తీన్మార్ న్యూస్): తెలంగాణ సర్కార్ మరో కీలక నిర్ణయం తీసుకున్నది. ఈ మేరకు ఆసియాలోనే అతిపెద్ద మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు రూ.150 కోట్లు మంజూరు చేస్తూ ఆర్థిక శాఖ పాలనాపరమైన అనుమతులిస్తూ ఉత్తర్వులు విడుదల చేసింది. వచ్చే ఏడాది జనవరి 28 నుంచి సమ్మక్క సారలమ్మ జాతర ప్రారంభమై 31న ముగియనుంది. ఈ మేరకు తాజాగా మంజూరైన నిధులతో భక్తులు, వీఐపీల కోసం రూ.5 కోట్లతో గెస్ట్ హౌస్ నిర్మాణం చేపట్టనున్నారు. ఇప్పటికే నాలుగునూట్ల గెస్ట్ హౌస్ నిర్మాణానికి ఆర్ అండ్ బీ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ అనుమతులు ఇచ్చారు. కాకతీయ రాజుల కాలం నుంచి కొనసాగుతూ వస్తున్న ఈ జాతరకు కోటి మందికి పైగా భక్తులు హాజరవుతారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆసియాలోనే అతి పెద్ద గిరిజన జాతరగా ప్రసిద్ధి చెందిన మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు వచ్చే కోట్లాది మంది భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించే దశగా రేవంత్ సర్కార్ ప్రణాళికలు రూపొందిస్తోంది.

## సినీ కార్మికుల సమ్మెపై సీఎం జోక్యం



మొదటి పేజీ తరువాయి

తాజాగా ఈ ఇష్యూపై తెలంగాణ ప్రభుత్వం జోక్యం చేసుకున్నది. ఫిల్మ్ చాంబర్, ఫెడరేషన్ నాయకులతో చర్చించి సమస్యను పరిష్కరించాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. సమ్మె ప్రభావం సినిమా పాలసీపై పడుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌ను సినిమా హబ్‌గా మార్చాలని సర్కార్ ఆలోచిస్తుంటే ఇలా సమ్మెలతో ఇండస్ట్రీని చిక్కుల్లోకి నెట్టడం కరెక్ట్ కాదని అన్నారు. తక్షణమే ఈ సమస్యకు పరిష్కారం ఆలోచించాలని అధికారులను ఆదేశించారు. కాగా, వేతనాల పెంపు కోసం ఫెడరేషన్ సభ్యులు చేస్తున్న సమ్మెకు నేటితో 17 రోజులు గడిచింది. కొనసాగుతోన్న సమ్మె కారణంగా షూటింగులు పూర్తిగా నిలిచిపోయాయి. 30 శాతం వేతనాలు పెంచాలని కార్మికులు, ఇప్పటికే తీవ్ర నష్టాల్లో ఉన్న తాము అంత పెంచలేమని నిర్మాతలు ఎవరి వాదన వారు వినిపిస్తున్నారు.

# భార్య పిల్లల బాగోగులు చూడని ఉద్యోగి సస్పెన్షన్

## పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంచలన నిర్ణయం



పెద్దపల్లి, ఆగస్టు 20(తీన్మార్ న్యూస్): పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంచల నిర్ణయం తీసుకున్నారు. గృహ హింసకు పాల్పడుతూ భార్యా పిల్లల మంచి చెడుల పట్ల బాధ్యతవహించని ఓ ప్రభుత్వ ఉద్యోగిని తన విధుల నుండి సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. వివరాల్లోకి వెళ్తే... పెద్దపల్లి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని ఓదెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫార్మసిస్టుగా పని చేస్తున్న కె. రవీందర్ తన భార్యా పిల్లలను పట్టించుకోకుండా వారి పోషణను నిర్లక్ష్యం చేస్తున్నాడని అతని భార్య కలెక్టరేట్ లో ఫిర్యాదు చేసిందని అన్నారు. స్థానిక సఖి కేంద్రం సిబ్బంది భార్యాభర్తల ఇరువురికి కౌన్సిలింగ్ నిర్వహించడానికి ప్రయత్నించగా, కె. రవీందర్ సహకరించలేదని, గృహహింస నిరోధక చట్టం ప్రకారం జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్ నోటీసులు జారీ చేసినప్పటికీ రవీందర్ కౌన్సిలింగ్ కు హాజరు కాలేదని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు నివేధిక అందించారని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల పరివర్తన నియమావళి ప్రకారం భార్య పిల్లల పోషణను నిర్లక్ష్యం చేస్తున్న ఫార్మాసిస్టు కె. రవీందర్ ను విధుల నుండి సస్పెండ్ చేస్తున్నట్లు కలెక్టర్ ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. కలెక్టర్ తీసుకున్న యూనియన్ రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపింది.

# లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన అటవీ శాఖ ఉద్యోగి



సూర్యాపేట, ఆగస్టు 20 (తీన్మార్ న్యూస్): లంచం తీసుకుంటూ అటవీ శాఖ ఉద్యోగి ఏసీబీకి (ACB) చిక్కాడు. కలప వ్యాపారం చేసుకునే వ్యక్తి నుంచి రూ.20 వేలు తీసుకుంటుండగా ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌ను అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సూర్యాపేట జిల్లా కోదాడ అటవీ రేంజ్ అధికారి కార్యాలయంలో అనంతుల వెంకన్న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు. రేంజ్ పరిధిలో కలప వ్యాపారం చేసుకునే వ్యక్తిని వెంకన్న లంచం అడిగాడు. కలప వ్యాపారానికి ఎటువంటి ఆటంకం కలగకుండా ఉండాలంటే తనకు రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు ఏసీబీకి సమాచారం ఇచ్చాడు. ఈ మేరకు బుధవారం బాధితుడి నుంచి లంచం తీసుకుంటుండగా వెంకన్నను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.

# మండల పరిధిలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీ సమావేశాలు





దామెర, ఆగస్టు 20 (తీన్మార్ న్యూస్): పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా దామెర మండలం కోగిల్వాయి, వెంకటాపూర్ గ్రామాలలో మండల బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల పార్టీ అధ్యక్షుల అధ్యక్షతన గ్రామ కమిటీ సమావేశాలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ నాయకులు గండు రాము,ఎండి జాకీర్ అలీ, పోలేం కృపాకర్ రెడ్డి,దామెరుప్పుల శంకర్, నేరెళ్ళ కమలాకర్, దాడి మల్లయ్య,కాగితాల శంకర్, గరిగె కృష్ణమూర్తి, పున్నం సంపత్ ఆయా గ్రామాల పార్టీ, అనుబంధ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, మాజీసర్పంచులు జంగిలి బాబు ,రంగా రెడ్డి,మాజీ ఎంపీటీసీలు సంగనబోయిన కిరణ్, జెల్ల అశోక్,నాయకులు జంగిలి రమేశ్, గడబోయిన రాజాలు, గుండా రవి,పోటు అనీల్, అజ్మత్,పెనుకుల ప్రశాంత్, రమాకాంత్, బోనగాని రాజు ,చిన్న రాజు, పున్నం రమేష్, పంచగిరి రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు



పరకాల, ఆగస్టు 20 (తీన్మార్ న్యూస్): హనుమకొండ జిల్లా పరకాల మున్సిపాలిటీ ఒకటవ వార్డులోని సీఎస్ఐ అంబేద్కర్ సెంటర్ లో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు తాజా మాజీ కౌన్సిలర్ మడికొండ సంపత్ కుమార్ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించి వారి చిత్ర పటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించి ఈ సందర్భంగా మడికొండ సంపత్ కుమార్ మాట్లాడుతూ దేశంలో ఐటీ రంగానికి పునాదులువేసి, భారీ విదేశీపెట్టుబడులనుఆకర్షించిన మార్గదర్శి, దివంగత ప్రధాని, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పరకాల పట్టణ కాంగ్రెస్ సమన్వయ కమిటీ సభ్యులు నాయకులు డాక్టర్. మడికొండ శ్రీను, బొచ్చు భాస్కర్
పరకాల యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సిలువేరు రాఘువ
వినయ్, మహేష్, నర్సింగం, శంకర్, సుధాకర్, భద్రయ్య, చిన్ని, సదయ్య, ప్రవీణ్, కల్యాణి, ప్రమీల, పెద్దలు, మహిళలు, యువకులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మహిళలు కుట్టు శిక్షణలో మెలకువలను నేర్చుకోవాలి

## హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

## ఆత్మకూరులో మహిళా కుట్టు శిక్షణా కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్





హనుమకొండ జిల్లా, ఆగస్టు 20 (తీన్మార్ న్యూస్): మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుట్టు నైపుణ్య శిక్షణ అభివృద్ధి కేంద్రాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని, కుట్టుకు సంబంధించిన మెలకువలను శిక్షణ కాలంలో నేర్చుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలో మండల మహిళా సమాఖ్య ద్వారా నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ శిక్షణ కేంద్రం ద్వారా ఎంతమంది శిక్షణ పొందుతున్నారని, కుట్టు శిక్షణలో ఎలాంటి యంత్రాలను వినియోగిస్తున్నారని కలెక్టర్ శిక్షణ పొందుతున్న మహిళలను అడిగారు. దీనిపై మహిళలు స్పందిస్తూ కుట్టు శిక్షణ కేంద్రంలో 45 మంది మహిళలు కుట్టుకు సంబంధించిన మెలకువలను నేర్చుకుంటున్నామని, వివిధ రకాల దుస్తుల కుట్టుకు అధునాతన కుట్టు మిషన్ల ద్వారా శిక్షణ ద్వారా నేర్చుకుంటున్నట్లు బదులిచ్చారు. శిక్షణా కేంద్రంలో మహిళలు కుట్టు మిషన్ల ద్వారా కుడుతున్న విధానాన్ని కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తరఫున కాకతీయ మెగా టెక్స్టైల్ పార్కులో ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు. టెక్స్టైల్ పార్కులో ఉపాధి అవకాశం వచ్చినా రాకున్నా స్వయం ఉపాధి ద్వారా సొంత కాళ్లపై నిలబడే అవకాశం లభిస్తుందన్నారు. గ్రామాలలో సొంతంగా కుట్టు ను ఏర్పాటు చేసుకుని ఆర్థిక అభివృద్ధిని సాధించాలన్నారు. కుట్టు మిషన్ల కొనుగోలుకు అవసరమైతే మహిళా సంఘాల ద్వారా కొనుగోలు చేసేందుకు చర్యలు చేపట్టాలని డిఆర్డిఓ మేన శ్రీనుకు కలెక్టర్ సూచించారు.

**ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించిన కలెక్టర్**

ఆత్మకూరులో పురోగతిలో ఉన్న పలు ఇందిరమ్మ ఇండ్లను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ పరిశీలించారు. ఇండ్ల నిర్మాణ పనులకు సంబంధించిన వివరాలను అధికారులు, లబ్ధిదారులతో కలెక్టర్ మాట్లాడారు. ఇండ్ల నిర్మాణానికి ఇసుక, కంకర, సిమెంటు, ఇటుకలు, స్టీల్, తదితర సామగ్రి ఎక్కడ నుండి, ఎంతెంత రేట్లకు తెచ్చుకుంటున్నారని లబ్ధిదారును కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇండ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతి గురించి ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు తహసీల్దార్ జగన్మోహన్ రెడ్డి, డిపిఎం రాజేంద్రప్రసాద్, ఏపీఎం సుజాత, తదితరులు పాల్గొన్నారు.

**మహిళా కుట్టు శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్**

హనుమకొండ జిల్లా, ఆగస్టు 20 (తీన్మార్ న్యూస్): హనుమకొండ జిల్లా దామెర మండల కేంద్రంలోని దామెర కుట్టు శిక్షణ నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా మహిళా కుట్టు శిక్షణ కేంద్రం ట్రైనర్స్, కుట్టు శిక్షణలో మెలకువలు నేర్చుకుంటున్న మహిళలతో కలెక్టర్ మాట్లాడారు. కుట్టు శిక్షణ కేంద్రం గురించిన వివరాలను నిర్వాహకులు, అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ కుట్టు శిక్షణ కేంద్రం ద్వారా ఇప్పటివరకు ఎంతమంది మహిళలు శిక్షణ పొందారని, కుట్టు శిక్షణలో నైపుణ్యాభివృద్ధిని ఎలా పెంపొందిస్తున్నారని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. శిక్షణానంతరం ఉపాధి అవకాశాలను గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కుట్టు శిక్షణలో నైపుణ్య అభివృద్ధిని సాధించాలని మహిళలకు సూచించారు. శిక్షణానంతరం ఉపాధి అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. మహిళా కుట్టు శిక్షణ నైపుణ్య అభివృద్ధి కేంద్రం ఆవరణలో కలెక్టర్ మొక్క నాటి నీళ్లు పోశారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ మేన శ్రీను, సెర్ఫ్ అడిషనల్ డిఆర్డివో వెంకటేశ్వర్లు, ఎంపీడీవో కల్పన, డిపిఎం రాజేంద్రప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# సంఘటితమైతేనే సమస్యల పరిష్కారం

## జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్




హనుమకొండ, ఆగస్టు 20 (తీన్మార్ న్యూస్): హనుమకొండ జిల్లా స్వర్ణకారుల సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని బుధవారం రోజున హనుమకొండ చౌరస్తా లోని వీనస్ ఫంక్షన్ హాల్ నందు నిర్వహించగా... ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నేటి గ్లోబలైజేషన్లో కులవృత్తులు, చేతివృత్తులు కనుమరుగవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మల్టీ నేషనల్, మల్టీ బ్రాండింగ్ కంపెనీల కారణంగా చిన్న కుటీర పరిశ్రమలు అస్తిత్వం దెబ్బతింటోందని అన్నారు. వృత్తి కులాలు ముఖ్యంగా బీసీ కులాలు సంఘటితం కావలసిన సందర్భం ఏర్పడిందని అన్నారు. 2009 నుంచి 2023 వరకు ఎమ్మెల్యే ఉన్నంత కాలం చిరు వ్యాపారులు, కులవృత్తిదారులు, స్థానిక వ్యాపారస్తులకు అన్ని విధాల సహకరించానని వివరించారు. స్వర్ణకారుల వృత్తి ఎంతో నైపుణ్యాలతో, శ్రమతో సమ్మిళితమైన కళా వృత్తి అని కొనియాడారు. మల్టీ నేషనల్ కంపెనీల కారణంగా స్వర్ణకారుల జీవనం, వ్యాపారం గడవడం ఇబ్బంది అవుతుందని తెలిపారు. ఈ ప్రతికూల పరిస్థితుల్లో స్వర్ణకారులు అందరూ సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. వెండి బంగారు ఆభరణాల తయారీలో ఆయా వృత్తి కులాల వారే ఉండాలని, ఆ వైపుగా సంఘం కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని శాలువాలతో సన్మానించారు. కాగా... సంఘం అధ్యక్షులుగా పానుగంటి శ్రీధర్, ప్రధాన కార్యదర్శిగా మణింద్రనాథ్, కోశాధికారిగా సతీష్, ఉపాధ్యక్షులుగా బ్రహ్మం, రవి, రాజ్ కుమార్, ప్రసాద్, పూర్ణచందర్, గౌరవ సలహాదారులుగా కోటేశ్వర్ రావు, కమలాకర్, రవీంద్ర, చక్రపాణి, ముఖ్య సలహాదారుగా మధు సుధానాచారి, సహాయ కార్యదర్శులుగా రత్నాకర్, ప్రవీణ్, కార్యవర్గ సభ్యులుగా వాసు, వేణు, అనిల్, ప్రణయ్, రాజు, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, అరవింద్, కిరణ్, శ్రీనివాస్, గాయత్రి ఉన్నారు. కాగా కార్యక్రమంలో రాఘవా చారి, వెంకట స్వామి, సత్యనారాయణ, పెంటయ్య చారి, ఈశ్వర ప్రసాద్, కమలాకర్, కోటేశ్వర్ రావు, రాజేందర్, కృష్ణమాచారి, రమేష్, శ్రీనివాస్ చారి, జయ సేన, చక్రపాణి, భిక్షపతి, రవీంద్ర, జగన్, జయసాగర్ తదితరులు పాల్గొన్నారు

# ఏటీసీ పోస్టర్‌ను ఆవిష్కరించిన అదనపు కలెక్టర్



హనుమకొండ జిల్లా, ఆగస్టు 20 (తీన్మార్ న్యూస్): అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్స్ (ఏటీసీ) లలో ప్రవేశాలకు సంబంధించిన పోస్టర్లను హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి బుధవారం ఆవిష్కరించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో పలు ప్రభుత్వ ఐటిఐ లలో ప్రవేశాలకు సంబంధించిన పోస్టర్లను జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, అధికారులతో కలిసి విడుదల చేశారు. ఐటిఐ, ఏటీసీలలో అడ్మిషన్లు జరుగుతున్నాయని, ఈ నెల 28 దరఖాస్తులకు ఆఖరి తేదీ అని కాజీపేట ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు, హనుమకొండ ఐటిఐ ప్రిన్సిపల్ సక్రు, వరంగల్ ప్రిన్సిపల్ వేణు వెల్లడించారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఐటిఐలో పలు కోర్సులకు అర్హులు అని పేర్కొన్నారు. అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్స్ హనుమకొండ, కాజీపేటలో ఉన్నాయని తెలిపారు. ప్రతి ఏటిసిలో కోర్సులు ఉన్నాయని, వీటిలో 172 సీట్లు ఉన్నాయన్నారు. ఐటిఐ/ ఏటీసీలలో ప్రవేశాలకు సంబంధించి సెర్ప్ సీఈవో దివ్య, ఎడ్యుకేషనల్ ప్రిన్సిపల్ సెక్రెటరీ యోగితా రాణా హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఓ మేన శ్రీను, ఉపాధి శిక్షణ శాఖ ఆర్డిడి సీతారాములు, ఇతర అధికారులతో పాటు జిల్లా సమాఖ్య, మండల సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో బీ.ఆర్.ఎస్ సత్తా చాటాలి






గీసుగొండ, ఆగస్టు 20 (తీన్మార్ న్యూస్): పరకాల మాజీ శాసనసభ్యులు చల్లా ధర్మారెడ్డి ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా గీసుగొండ మండల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో దస్రు తండా, నందనాయక్ తండా, హర్జా తండా, గంగదేవిపల్లి గ్రామలలో బిఆర్ఎస్ పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించి స్థానికసంస్థల్లో మన పార్టీ సత్తా చాటాలి, సోషల్ మీడియాలలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న తప్పులను ఎప్పటికప్పుడు తిప్పి కొట్టాలని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెల్లాలని కార్యకర్తలతో చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పోలీస్ ధర్మారావు,మండల పార్టీ కార్యదర్శి చల్లా వేణు గోపాల్ రెడ్డి ,సమన్వయ కమిటీ సభ్యులు బోడకుంట్ల ప్రకాష్,అంకతి నాగేశ్వర్ రావు,పుండ్రు జైపాల్ రెడ్డి, ముంత రాజయ్య,,కంబాల కోటి, గుర్రం రఘు,యూత్ అధ్యక్షుడు శిరిసే శ్రీకాంత్,సోషల్ మీడియా కోర్డినేటర్ జూలూరి లెనిన్, యూత్ నాయకులు ప్రమోద్,మంద రాజేందర్, రాజు గ్రామాల అధ్యక్ష కార్యదర్శిలు, యూత్ నాయకులు, స్థానిక కార్యకర్తలు పాల్గొన్నారు..

# కలెక్టరేట్లో కాల్ సెంటర్ ఏర్పాటు

## కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**18004253424 టోల్ ఫ్రీ, 0870-2530812**

**9154252936 ఫోన్ నెంబర్లకు సంప్రదించండి**



వరంగల్ జిల్లా, ఆగస్టు 20 (తీన్మార్ న్యూస్): జిల్లాలో యూరియా కొనుగోలు, ఇతర సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్ లో ఏర్పాటుచేసిన కాల్ సెంటర్ ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద నేడోక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల సౌకర్యం ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ 18004253424 టోల్ ఫ్రీ నెంబర్, 0870-2530812, 9154252936 ఫోన్ నెంబర్లు జిల్లాలోని ప్రతి ఎరువుల విక్రయ దుకాణాల వద్ద ప్రదర్శించడం జరుగుతుందని, యూరియా కొనుగొలు ప్రక్రియ, ఇతర సమస్యలను పై నంబర్లకు సంప్రదించి పరిష్కరించుకోవాలని కలెక్టర్ కోరారు.

# యూరియా పంపిణీకి చర్యలు తీసుకోవాలి

**జిల్లాలో యూరియాకు ఎలాంటి కొరత లేదు**

**అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు కేటాయింపు**

**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**






వరంగల్ జిల్లా, ఆగస్టు 20 (తీన్మార్ న్యూస్): జిల్లాలో యూరియాకు ఎలాంటి కొరత లేదని, యూరియా సక్రమ పంపిణీకి ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ సమావేశం మందిరంలో కలెక్టర్ డాక్టర్ సత్య శారద జిల్లా అధికారులు, వ్యవసాయ అధికారులు, ఎరువుల కంపెనీల ప్రతినిధులు, డీలర్లతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో యూరియాను జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు అవసరం మేరకు కేటాయించడం జరిగిందన్నారు. యూరియా సక్రమంగా పంపిణీలో వివిధ ఎరువుల కంపెనీల ప్రతినిధులు, ఎరువుల డీలర్లు సహకరించాలని కలెక్టర్ కోరారు. రెవెన్యూ పోలీస్ వ్యవసాయ శాఖల అధికారులు సమన్వయంతో సక్రమ పంపిణీ జరిగేలా చూడాలని, పంపిణీలో ఎలాంటి అక్రమాలు చోటు చేసుకోకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, ముఖ్యంగా వ్యవసాయ అధికారులపై గురుతరమైన బాధ్యత ఉందన్నారు. ఉన్న యూరియా నిల్వలను నిజాయితీగా అవసరం ఉన్న రైతులకే పంపిణీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రైతులు అనవసరంగా యూరియాను నిల్వ ఉంచుకో వద్దని అవసరం ఉంటేనే యూరియాను తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కేంద్రాల వద్ద ఎక్కువమంది రైతులు గుమ్మి గుడి ఉండకుండా ప్రణాళిక బద్ధంగా ప్రతిరోజు ప్రతి మండలంలో 3 గ్రామాల రైతులకు యూరియా అందించేలా ముందస్తుగా టోకెన్లు అందజేసి, యూరియా పంపిణీ సమయంలో రైతులకు పంటల ఆరోగ్య దీపిక కార్డులలో పంపిణీ చేసిన యూరియా వివరాలు నమోదు చేయాలన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రాల వద్ద ఎక్కువమంది రైతులు వస్తున్న నేపథ్యంలో వైద్యారోగ్య శాఖ ద్వారా ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. యూరియాకు బదులు నానో యూరియా యొక్క ప్రాముఖ్యతను వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు వివరిస్తూ రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. అందుకుగాను వివిధ ఎరువుల కంపెనీల ప్రతినిధులు, జిల్లాలోని 650 డీలర్ల వద్ద నానో యూరియా అందుబాటులో ఉంచుకుంటూ రైతులకు అవగాహన కల్పిస్తూ వినియోగించేలా ప్రోత్సహించాలన్నారు.

ప్రగతిశీల రైతులకు నానో యూరియా లాభాల గురించి వివరిస్తూ వారి ద్వారా సామాన్య రైతులలో నానో యూరియా వాడకం పై చైతన్యం కల్పించాలన్నారు. యూరియా సక్రమ సరఫరాలో భాగంగా అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, ముఖ్యంగా యూరియా ఇతర ప్రాంతాలకు తరలి వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పి సీఈఓ రామిరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, డి సి ఓ నీరజ, డిపిఓ కల్పన, డి ఎం హెచ్ ఓ డాక్టర్ సాంబశివరావు, ఆర్డీవోలు సత్యపాల్ రెడ్డి, ఉమారాణి, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారులు, వివిధ ఎరువుల కంపెనీల ప్రతినిధులు, ఎరువుల డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

# పిహెచ్సిలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ





వరంగల్ జిల్లా, ఆగస్టు 20 (తీన్మార్ న్యూస్): గీసుకొండ మండలం కీర్తి నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్సీలోని రక్త పరీక్షల గది, మందులు అందజేసే గది, ఇన్ పేషెంట్ వార్డ్, బెడ్స్, టాయిలెట్స్, వాక్సినేషన్ ను పరిశీలించారు. ప్రతిరోజూ హాస్పిటల్ కు ఎంత మంది రోగులు వస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో మందుల స్టోర్ రూమ్ లో స్టాక్ వివరాలను తనిఖీ చేసి మందుల గడువు తేదీలను పరిశీలించారు. పారాసెటమాల్ మందు అధికంగా ఉండడం పై ఫార్మసీ పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ అవసరం మేరకే మందుల ఇండెంట్ తెప్పియాలన్నారు. ప్రతి మందు ఈ ఔషధం ప్రకారమే రోగులకు అందించాలన్నారు. ఆసుపత్రి పరిసరాలను పరిశీలించి మరింతగా పరిశుభ్రంగా ఉంచాలని, స్క్రాప్ ను వెంటనే తొలగించుటకు చేయుటకు చర్యలు తీసుకోవాలని మెడికల్ ఆఫీసర్ ను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలు పూర్తిస్థాయిలో అందించాలని తద్వారా ప్రజల్లో ప్రజా వైద్య సేవలపై నమ్మకం ఏర్పడుతుందని తెలిపారు. హాస్పిటల్ కు వచ్చే రోగులకు సీజనల్ వ్యాధుల పై అవగాహన కల్పించాలని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పై వివరించాలని సూచించారు. కలెక్టర్ వెంట జెడ్పి సీఈఓ రామిరెడ్డి, డిఎం హెచ్ ఓ డాక్టర్ సాంబశివరావు, డీఈఓ జ్ఞానేశ్వర్, మెడికల్ ఆఫీసర్ హుస్సేన్ తదితరులు ఉన్నారు.

# 9 ఎరువుల దుకాణ షాపుల లైసెన్సులు రద్దు

**జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని విజయనిర్మల**



మహబూబాబాద్ జిల్లా, ఆగస్టు 20 (తీన్మార్ న్యూస్): జిల్లాలో యూరియా కొరతను అధిగమించేందుకు వ్యవసాయ రెవెన్యూ పోలీస్ శాఖల సంయుక్త తనిఖీలలో భాగంగా అన్ని మండలలో ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీల పంపిణీ అవుతున్న యూరియా నిల్వలను పకడ్బందీగా రైతులకు పంపిణీ చేయడానికి జిల్లా యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుందనీ జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని విజయనిర్మల అన్నారు. జిల్లాలోని ప్రైవేటు డీలర్ల యొక్క ఎరువుల నిలువలు యూరియా అమ్మకాలు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలిస్తూ ప్రైవేటు డీలర్ల ద్వారా వీరి నుండి వచ్చిన యూరియా నిలువలను కూడా వ్యవసాయ, పోలీస్, రెవెన్యూ, సంబంధిత టాస్క్ ఫోర్స్, సిబ్బంది ద్వారా నిత్యం పర్యవేక్షిస్తూ రైతులకు యూరియాను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని మండలాల ఎరువుల దుకాణాలను టాస్క్ ఫోర్స్ టీములు ముమ్మురంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం జరిగిందని, ప్రభుత్వ ఎరువుల నియంత్రణ చట్టం 1985ను అతిక్రమించి ఎరువుల వ్యాపారం నిర్వహిస్తున్న జిల్లాలోని డోర్నకల్ 3, కురవి 2, మరిపెడ 1, చిన్న గూడూరు 1, నెల్లికుదురు 1, మహబూబాబాద్ 1, మొత్తం (9) ఎరువుల దుకాణదారుల లైసెన్సులను తాత్కాలికంగా రద్దు చేయడం జరిగిందని, ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా వ్యాపారం నిర్వహిస్తున్న సలార్ తండా లోని ఒక షాప్ ఈశ్వరి ట్రేడర్స్ యజమానులకు షోకాజ్ మెమోలు ఇవ్వడం అయిందని వ్యవసాయ శాఖ అధికారిని ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా ప్రైవేటు ఎరువుల డీలర్స్ వారికి వచ్చే యూరియా, ఇతర ఎరువుల నిల్వలను పకడ్బందీగా స్టాక్ రిజిస్టర్లలో ఈపాస్ మిషన్లలో, పొందుపరిచి బిల్లుల రూపంలో రైతులకు ప్రతి భస్త అందించాలని, ఆదేశిస్తూ నిబంధనలు పాటించని ప్రైవేటు డీలర్లను వారి లైసెన్సులను రద్దు చేస్తామని అలాగే వారిపై క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తామని తెలిపారు.

# సిఆర్ టిస్కూల్ అసిస్టెంట్ నియమానికి ధరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ జిల్లా, ఆగస్ట్ 20 (తీన్మార్ న్యూస్): మహబూబాబాద్ జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఖాళీగా గల సి.ఆర్.టి. స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్ 01 పోస్టునకు, పిజికల్ డైరెక్టర్ గ్రేడ్-11 రెండు పోస్టులకు మొత్తంగా 03 పోస్టులకు గాను అర్హులైన అభ్యర్థుల నుండి ధరఖాస్తులు ఆహ్వానించడమైనదని గిరిజన శాఖ సంక్షేమ శాఖ ఉప సంచాలకులు దేశీరాం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు గాను స్థానిక గిరిజన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వబడునని, బాలికల పాఠశాలల్లో మహిళా అభ్యర్థులను నియమించబడునని, 1వ తరగతి నుండి 7వ తరగతి వరకు (వరుసగా 4 సంవత్సరములు) మహబూబాబాద్ జిల్లా నందు చదివిన అభ్యర్థులు ఆ జిల్లా స్థానికులుగా పరిగణించబడునని ఆయా సబ్జెక్ట్ ల యందు డిగ్రీ, %దీ.జు.ు / దీూవ.ు%మరియు %ఖుజూవతీ-××% తప్పని సరిగా పాస్ అయి ఉండవలెనని మహబూబాబాద్ జిల్లా స్థానిక అభ్యర్థులను వ్రాత పరీక్ష మరియు డెమో పరిక్ష ద్వార ఎంపిక చేయబడునని గతంలో సి. ఆర్.టి లుగా పని చేసిన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 21 నుండి 30 వ తేది సాయంత్రం 5 గంటల లోపు గిరిజన సంక్షేమశాఖ కార్యాలయంలో సమర్పించవలెనని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. కావున ఆసక్తి గల అభ్యర్థులు సరైన ధ్రువ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

# యూరియా సరఫరాలో ఇబ్బందులు లేకుండా దృష్టి సారించాలి

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ఆగస్టు 20 (తీన్మార్ న్యూస్): యూరియా సరఫరాపై రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం యూరియా సరఫరాపై క్యాంపు కార్యాలయం నుండి

వ్యవసాయ, సహకార, సహకార సంఘాల సీఈఓలు, మార్క్ ఫెడ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంటలకు అవసరమైన యూరియా రైతులకు అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని అన్నారు. రైతులు వరి, పత్తి, మిర్చి, పప్పు దినుసుల పంటలు ఒకేసారి సాగు చేయడం వల్ల యూరియా వినియోగం పెరిగినట్లు తెలిపారు. మండల స్థాయిలో స్టాక్ వివరాలు మానిటరింగ్ చేయాలని, ఎక్కడ అవసరం ఉంటే అక్కడికి యూరియా తరలించి రైతులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రైవేటు డీలర్లు యూరియా కొనుగోలుకు ఇతర యూరియా తీసుకోవాలని లింకు పెట్టొద్దని పర్యవేక్షణ చేయాలని తెలిపారు. ప్రతి రోజు ఎరువుల స్టాకు వివరాలు ఇవ్వాలని తెలిపారు. ప్రస్తుతం ఉన్న స్టాక్ పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని, అవసరాన్ని బట్టి నిల్వలున్న చోట నుండి తీసుకుని కొరత రాకుండా చూడాలని తెలిపారు. వ్యవసాయ అవసరాలకు కాకుండా ఇతర అవసరాలకు యూరియా డైవర్ట్ కావడానికి వీలు లేదని, రైతులు అధికంగా స్టాక్ పెట్టుకోవద్దని, అవసరం మేరకే కొనుగోలు చేసేలా అవగాహన కల్పించాలని అన్నారు. యూరియా, ఇతర ఎరువుల లభ్యత వివరాలను అధికారులు, టాస్క్ టీములు ప్రతిరోజు పర్యవేక్షించాలని అన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, మార్క్ ఫెడ్, ప్రైవేట్ కంపెనీల వద్ద మండల స్థాయిలో స్టాకు ఎంత ఉందో క్రమం తప్పకుండా పర్యవేక్షణ చేయాలని అన్నారు. మండలాల వారిగా పంటల సాగు ఎంత అయ్యింది, ఎరువుల లభ్యత బేరీజు వేసుకొని అందుబాటులో ఉన్న ఎరువుల స్టాక్ సమర్థవంతంగా, శాస్త్రీయంగా కేటాయింపు చేయాలని సూచించారు. ప్రతిరోజు జిల్లాలకు ఎరువుల స్టాక్ ఎంత వరకు రాబోతున్నాయి అంశాలను ముందస్తుగా అంచనా వేసుకుని కొరత రాకుండా చూడాలన్నారు.

ప్రస్తుతం అందుబాటులో ఉన్న యూరియా వ్యవసాయం కోసం మాత్రమే వినియోగించేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని, రైతులు ముందస్తుగా కొనుగోలు చేసి స్టాక్ పెట్టుకోవద్దని, ప్రస్తుత అవసరాల కోసం మాత్రమే యూరియా కొనుగోలు చేసేలా చూడాలని అన్నారు. టాస్క్ ఫోర్స్ బృందాలు ప్రైవేట్ ఎరువుల దుకాణాలను తనిఖీ చేయాలని అన్నారు. యూరియా అవసరం ఉన్న పరిశ్రమలు జిల్లాలో ఉంటే వాటిని తనిఖీ చేయాలని, మన జిల్లా నుండి బయటికి ఎరువులు వెళ్లకుండా పటిష్ట పర్యవేక్షణ చేయాలని తెలిపారు. వ్యవసాయ సంబంధిత ఎరువులను పరిశ్రమల కోసం వినియోగిస్తున్నట్లు గుర్తిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

గత రెండు నెలల్లో అధికంగా యూరియా కొనుగోలు చేసిన వ్యక్తుల వివరాలను ట్రాక్ చేయాలని, వీరు ఎక్కడైనా యూరియా డైవర్ట్ చేస్తున్నారా పరిశీలించాలని అన్నారు. జిల్లాలో అవకాశం ఉన్న ప్రత్యామ్నాయంగా నానో యూరియా ప్రోత్సహించాలని

తెలిపారు. జిల్లాలో ఎరువులు, యూరియా లభ్యత, సరఫరా పై రైతులకు స్పష్టమైన సమాచారం అందించాలని అన్నారు. జిల్లాలో యూరియా కోసం అనవసరంగా రైతులు లైన్ లో నిలబడకుండా ఎప్పుడు సరఫరా చేస్తామనే అంశం స్పష్టంగా తెలియజేయాలని అన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు, సహకార అధికారి వాలియానాయక్, మార్క్ ఫెడ్ డిఎం, సహకార సంఘాల సీఈఓలు, వ్యవసాయ శాఖ ఏఓలు తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు ఘనంగా

పాల్వంచ, ఆగస్టు 20 (తీన్మార్ న్యూస్): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు శ్రీ పైడిపల్లి దుర్గామహేష్, జిల్లా కాంగ్రెస్ నాయకులు కందుకూరి రాము రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం దుర్గామహేష్ మాట్లాడుతూ రాజీవ్ గాంధీ దేశానికి ఆధునికతను తీసుకువచ్చిన మహానాయకుడు. ఆయన ప్రోత్సాహంతోనే యువతకు 18 ఏళ్లకే ఓటు హక్కు లభించింది. సమాచార సాంకేతికత, టెలికాం విప్లవాలకు శ్రీకారం చుట్టిన దూరదృష్టి కలిగిన నాయకుడు రాజీవ్ గాంధీ. ఆయన ఆలోచనలు నేటి యువతకు మార్గదర్శకాలు అని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు ఉండేటి శాంతి వర్ధన్, అలెక్స్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ %బాదీజ% అధ్యక్షులు షేక్ అమీర్, యూత్ కాంగ్రెస్ నాయకులు జగన్నాథం అజిత్, ముళ్లపాటి శ్రీకాంత్, చింతలచెరువు రమేష్, వినేష్, సందీప్, కార్తీక్, ప్రదీప్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# దశదిన కార్యక్రమంలో పాల్గొన్న గ్రంథాలయ సంస్థ చైర్మన్, మార్కెట్ కమిటీ చైర్మన్

ఏటూరునాగారం, ఆగస్టు 20 (తీన్మార్ న్యూస్): రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచన మేరకు ములుగు జిల్లా ఎటునాగరం మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎర్రబెల్లి మనోజ్ రావు తండ్రి చక్రధర్ ఇటీవలే ఆరోగ్యం బాగా లేక చనిపోగా ఈ రోజు వారి నివాసం హన్మకొండలోని దశదిన కార్యక్రమంలో పాల్గొని వారి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, జిల్లా నాయకులు, ఈ కార్యక్రమంలో ఏటూరు నాగారం బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఇర్షవడ్ల వెంకన్న, ములుగు మాజీ ఎంపీటీసీ మావురపు తిరుపతి రెడ్డి, జిల్లా నాయకులు లక్కీ, ములుగు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అభినయ్ చారి, యూత్ నాయకులు ప్రభు తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.



# ఉపాధ్యాయులు బోధన పద్ధతిని మార్చుకోవాలి

**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**జెడ్ పి ఎస్ ఎస్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్**





వరంగల్ జిల్లా, ఆగస్టు 20 (తీన్మార్ న్యూస్): ఉపాధ్యాయులు బోధన పద్ధతిని మార్చుకొని విద్యార్థులకు మెరుగైన విద్య బోధించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. బుధవారం వరంగల్ నగరంలోని సుందరయ్య నగర్ జెడ్ పి ఎస్ ఎస్ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. సుందరయ్య నగర్ జెడ్ పి ఎస్ ఎస్ పాఠశాలలో ఉపాధ్యాయుల విద్యార్థుల ఎఫ్ ఆర్ సి హాజరును పరిశీలించారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థుల తెలుగు ఇంగ్లీష్ హిందీ భాషల పఠన సామర్థ్యాన్ని కలెక్టర్ పరిశీలించి, విద్యార్థులు సక్రమంగా చదవకపోవడంపై సంబంధిత ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ బోధన పద్ధతులను మార్చుకోవాలని, అందుకుగాను ఉపాధ్యాయులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించాలని ప్రధానోపాధ్యాయులను కలెక్టర్ ఆదేశించారు. పాఠశాలలో వసతులు, విద్యార్థుల ఆహార మెను, వంటగదిని పరిశీలించారు. రోజువారి మెనూ పక్కగా అమలు చేయాలన్నారు. విద్యార్థుల నుండి భోజనం నాణ్యత పై ఫీడ్బ్యాక్ తీసుకొని వారికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా మెనూ పక్కగా అమలు చేయాలన్నారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా అవగాహన కల్పించాలని, అందరూ విద్యార్థులు యూనిఫామ్ ధరించి పాఠశాలకు వచ్చేలా చూడాలని ప్రధానోపాధ్యాయుడిని ఆదేశించారు. అధికారులచే నిరంతరం ఆకస్మిక తనీఖీలు కొనసాగుతాయని ఏదైనా లోపం వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న రెండు గదుల మరమ్మతులకు చర్యలు చేపట్టాలని డీఈఓను ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్య పరీక్షలు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈఓ రామిరెడ్డి, డిఎం హెచ్ ఓ డాక్టర్ సాంబశివరావు, డీఈఓ జ్ఞానేశ్వర్, తహసీల్దార్ మహ్మద్ ఇక్బాల్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

# ఆరోగ్య కేంద్రం, ఇందిరమ్మ ఇండ్లు, పాఠశాలను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్



హనుమకొండ జిల్లా, ఆగస్టు 20 (తీన్మార్ న్యూస్): హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, లబ్ధిదారులు నిర్మించుకుంటున్న ఇందిరమ్మ ఇండ్ల పురోగతి, కేజీబీవీ పాఠశాల, స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో పలు రికార్డులను తనిఖీ చేసి ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను గురించి వైద్యాధికారులు సిబ్బందిని అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి అడిగి తెలుసుకున్నారు. ఎల్కతుర్తిలో పురోగతిలో ఉన్న పలువురు లబ్ధిదారులకు చెందిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించి నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. కేజీబీవీ పాఠశాలను సందర్శించి విద్యార్థినులకు వండిన భోజన పదార్థాలను పరిశీలించారు. విద్యార్థినులతో అదనపు కలెక్టర్ మాట్లాడి ఏవైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భూభారతి దరఖాస్తుల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యల గురించి తహసీల్దార్ ప్రసాద్ రావు ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రవిబాబు, పలు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మృతి చెందిన వాసం సమ్మయ్యకు నివాళులు అర్పించిన బడే నాగజ్యోతి



గోవిందరావుపేట, ఆగస్టు 20 (తీన్మార్ న్యూస్): బుధవారం ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ వాసం సమ్మయ్య అనారోగ్యంతో మృతిచెందగా వారి స్వగృహానికి వెళ్లి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించిన టిఆర్ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గ ఇంచార్జి బడే నాగజ్యోతి, వారి కుటుంబ సభ్యులను ఓదార్చి మనోధైర్యంగా ఉండాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో గోవిందరావుపేట మండల అధ్యక్షుడు లకావత్తు నరసింహ నాయక్, లకావత్ చందులాల్, జిల్లా మహిళా నాయకురాలు ఇరుప విజయ,జిల్లెల్ల కొమురయ్య, ఎండి అజీజ్ పాషా, సాంబయ్య, వెంకన్న, రఫీద్ అనుము, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# దశదిన కార్యక్రమానికి హాజరై నివాళి అర్పించిన బడే నాగజ్యోతి



గోవిందరావుపేట, ఆగస్టు 20 (తీన్మార్ న్యూస్): ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని రాఘవపట్నం గ్రామానికి చెందిన సువర్ణపాక రంజిత్ అనారోగ్యంతో మృతి చెందినారు, ఈరోజు దశదిన కార్యక్రమానికి హాజరై చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించిన బిఆర్ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గ ఇంచార్జి బడే నాగజ్యోతి, అదేవిధంగా వారి కుటుంబ సభ్యులను ఓదార్చి మనోధైర్యంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గోవిందరావుపేట మండల అధ్యక్షుడు లకావత్ నరసింహ నాయక్, కంఠం నాగేశ్వరరావు, నాం పూర్ణచందర్, చుక్క గట్టయ్య, ఎట్టి జగదీష్, దర్శనాల సంజీవ, చుంచు యాకూబ్, ఇరుప సారయ్య, మాలోతు రవి, బొల్లం శివ, సామ నాగక్క, ఇరుప విజయ, తదితరులు పాల్గొన్నారు.

# ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని సందర్శించిన డిఎం అండ్ హెచ్ఓ



మహబూబాబాద్ జిల్లా, ఆగస్ట్ 20 (తీన్మార్ న్యూస్): బుధవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా. రవి రాథోడ్ కేసముద్రం, ఇనుగుర్తి మండలాల పరిధిలోని కొరుకొండపల్లి గ్రామంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని (%ూఎజ% ఇనుగుర్తి పరిధి) మరియు ధనసరి గ్రామంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని (%ూఎజ% కేసముద్రం పరిధి) సందర్శించారు. ఈ సందర్శనలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి ఆరోగ్య సిబ్బందితో సమీక్ష నిర్వహించి ముఖ్యమైన సూచనలు ఇచ్చారు. ప్రత్యేకంగా ప్రస్తుత కాలంలో వ్యాప్తి చెందే సీజనల్ వ్యాధులపై గ్రామ ప్రజల్లో అవగాహన కల్పించాలని, వర్షాభావ పరిస్థితుల్లో వైద్య సిబ్బంది స్థానికంగా ఉంటూ ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు. ఎవరైనా విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే అలాంటి వారిపై చర్యలు తప్పవన్నారు. అవసరమైతే గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని, ప్రతి కార్యక్రమానికి సంబంధించిన రికార్డులను సమగ్రంగా, క్రమబద్ధంగా నిర్వహించాలని ఆదేశించారు. మాతా శిశు సంరక్షణ కార్యక్రమంలో గర్భిణీ స్త్రీల నమోదు 12 వారాల్లో జరగాలని, సాధారణ ప్రసవాలు అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో జరిగేలా పర్యవేక్షించాలన్నారు, ఎవరైనా అబార్షన్లు ప్రోత్సహిస్తే అలాంటి వారి సమాచారాన్ని ప్రభుత్వ వైద్యులకు అందించాలన్నారు. సిజేరియన్ ఆపరేషన్లను తగ్గించాలని, పిల్లలకు వంద శాతం వ్యాధి నిరోధక టీకాలు ఇప్పించాలని, అసంక్రమిత వ్యాధులైన బిపి షుగర్, క్యాన్సర్ వ్యాధులు నిర్ధారణ 30 సంవత్సరములు పైబడిన వారందరినీ పరీక్షించాలని, రెండు వారాలకు పైన దగ్గుతో బాధపడుతున్న వ్యక్తులకు తెమడ పరీక్షలు చేయాలని, టెలి మెడిసిన్ సేవలను వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ సారంగం, డాక్టర్ సుధీర్ రెడ్డి, వైద్యాధికారి డాక్టర్ నంబి కిషోర్, డిప్యూటీ డెమో ప్రసాద్, సి హెచ్ ఓ సాజిద్, హెచ్ ఈ ఓ లోక్య, యం ఎల్. హెచ్ పి లు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# చిన్నారిని ఆశీర్వదించిన పైడాకుల కృష్ణమూర్తి



గోవిందరావుపేట, ఆగస్టు 20 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర మంత్రి సీతక్క ఆదేశాలమేరకు జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ సూచనమేరకు ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామానికి చెందిన నంద్యాల శేషు బాబు మనవడి 21%ర్% ( బారసాల ) మహోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేయగా.ఇట్టి మహోత్సవ కార్యక్రమనికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పైడాకుల కృష్ణమూర్తి విచ్చేసి చిన్నోడినీ ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా మహిళా కాంగ్రెస్ కార్యదర్శి మాజీ ఎంపీటీసీ గుండెబోయిన నాగలక్ష్మి అనిల్ యాదవ్, నాయకులు నర్రా రఘువీర్, వాసం స్వామి, డాక్టర్ వెంకట్ రెడ్డి,ముద్దసాని సాయి బాబు మరియు తదితరులు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# కాళేశ్వరంలో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ

## అధికార యంత్రాంగం, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ఆగస్టు 20 (తీన్మార్ న్యూస్): కాళేశ్వరం వద్ద గోదావరి నది నీటి మట్టం పెరుగుతుండడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసునట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం కాళేశ్వరంలో గోదావరి, సరస్వతి ఘాట్ల వద్ద వరద ఉధృతిని ఎస్పి కిరణ్ ఖరే తో కలిసి పరిశీలించారు. బుధవారం ఉదయం 7 గంటలకు సి డబ్ల్యూసి నివేదిక ప్రకారం 12.220 అడుగులకు చేరడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసినట్లు ఆయన తెలిపారు. ప్రజల ప్రాణరక్షణలో యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, విద్యుత్, ఆరోగ్య తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. నది పరివాహక గ్రామాల్లో నివసిస్తున్న ప్రజలకు ముందుగానే సమాచారం అందించడంతో పాటు లోతట్టు ప్రాంతాల ప్రజలను గుర్తించి సురక్షిత ప్రాంతాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించే చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. అత్యవసర పరిస్థితులలో సేవలు అందించడానికి ఎన్ డి ఆర్ ఎఫ్, ఎస్డీ ఆర్ ఎస్ బృందాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు యంత్రాంగం పరిస్థితిని నిశితంగా పర్యవేక్షించాలని ఆయన అధికారులను ఆదేశించారు. అత్యవసర సేవలకు కలెక్టరేట్ నందు ఏర్పాటు చేసిన 9030632608 నంబర్ కు కాల్ చేయాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ప్రజలకు సూచనలు చేశారు.

- వరద పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రజలు జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.
- నది తీర ప్రాంతాలకు వెళ్లరాదని తెలిపారు.
- వరద నీటిలో వాహన ప్రయాణాలు చేయరాదన్నారు.
- పిల్లలు, వృద్ధులను జాగ్రత్తగా ఉంచాలని తెలిపారు.
- అధికారులు జారీ చేసే సూచనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.
- అవసరమైతే ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు వెళ్లాలన్నారు.
- ఎస్పి కిరణ్ ఖరే మాట్లాడుతూ అత్యవసర సేవలకు పోలీస్ యంత్రాంగం సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఏదేని అత్యవసర పరిస్థితిలో పోలీస్ కంట్రోల్ రూము 100 కు కాల్ చేయాలని తెలిపారు. పరిసరాల్లోకి ప్రజలు వెళ్లకుండా పోలీస్ పటిష్ట నియంత్రణ చేయాలని సూచించారు. ఎగువ ప్రాజెక్టు ల నుండి వరద వస్తున్నందున ఎప్పటికప్పుడు వరద సమాచారం ప్రజలకు చేరవేస్తూ అప్రమత్తం చేయాలని, ఎలాంటి ప్రాణ నష్టం వాటిల్లకుండా ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. అనంతరం అన్నారం వెళ్ళు రహదారిలో చంద్రుపల్లి వద్ద కాజ్ వే పై నీళ్లు చేరిన ప్రాంతాన్ని పరిశీలించారు. పూర్తిగా నీరు తగ్గే వరకు ప్రజలను ప్రయాణాలు చేయకుండా భారీ కేడింగ్ కొనసాగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి నవీన్ రెడ్డి, సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయతీ రాజ్ అధికారులు పాల్గొన్నారు.

# రెండవ ప్రమాదక హెచ్చరిక జారీ చేశాం

## అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## జిల్లా కలెక్టర దివాకర టి.ఎస్



ములుగు జిల్లా, ఆగస్టు 20 (తీన్మార్ న్యూస్): ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరి నది ఉగ్రరూపం దాల్చి ప్రవహిస్తూ ఉండడంతో జిల్లాలోని రామన్నగూడెం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేయడం జరిగిందని, గోదావరి ఉధృతంగా ప్రవహిస్తున్న సందర్భంగా అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. బుదవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటలకు

గోదావరి వరద ఏటూరు నాగారం మండలం రామన్నగూడెంలో 15.83 మీటర్స్ చేరడంతో రెండవ ప్రమాద హెచ్చరిక జారీ చేసినట్లు ఆయన తెలిపారు. జిల్లాలోని గోదావరి పరివాహక ప్రాంతాల గ్రామాల ప్రజలను ఇప్పటికే అప్రమత్తం చేయడం జరిగిందని, ఏలాంటి ముప్పు ఏర్పడిన తక్షణమే అధికారులకు సమాచారం ఇవ్వాలని ఆయన తెలిపారు. జిల్లాలోని వెంకటాపురం మండలంలో ఐదు కుటుంబాల వారిని, వాజేడు మండలంలో 15 కుటుంబాల వారిని, కన్నాయి గూడెం మండలంలో 33 కుటుంబాల వారిని, గోవిందరావుపేట మండలం లోని రెండు కుటుంబాల వారిని , ఏటూరునాగారం మండలంలో 50 మందిని పునరావాస కేంద్రాలకు తరలించి వారికి అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. జిల్లాలో 8 పునరావాస కేంద్రాలలో 75 కుటుంబాలకు చెందిన 216 మందిని ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించి అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఇప్పటికే ఎన్ డి ఆర్ ఎఫ్, ఎస్ డి ఆర్ ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచామని వారితోపాటు జిల్లా పోలీసు యంత్రాంగం అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

**ఈ సందర్భంగా ప్రజలకు సూచనలు చేశారు**

- వరద పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రజలు జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.
- నది తీర ప్రాంతాలకు వెళ్లరాదని తెలిపారు.
- వరద నీటిలో వాహన ప్రయాణాలు చేయరాదన్నారు.
- పిల్లలు, వృద్ధులను జాగ్రత్తగా ఉంచాలని తెలిపారు.
- అధికారులు జారీ చేసే సూచనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.
- అవసరమైతే ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు వెళ్లాలన్నారు.

గోదావరి పరిసర ప్రాంతాలలో జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 1800 425 7109 కు కాల్ చేయవచ్చని కలెక్టర్ ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రజల ప్రాణరక్షణలో యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, విద్యుత్, ఆరోగ్య తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. నది పరివాహక గ్రామాల్లో నివసిస్తున్న ప్రజలకు ముందుగానే సమాచారం అందించడంతో పాటు లోతట్టు ప్రాంతాల ప్రజలను గుర్తించి సురక్షిత ప్రాంతాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించే చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు యంత్రాంగం పరిస్థితిని నిశితంగా పర్యవేక్షించాలని ఆయన అధికారులను ఆదేశించారు.

# రాన్ సంవాద్‌ను నిర్వహించనున్న రక్షణ శాఖ

## ఈ నెల 26 నుండి 27 వరకు జరగనున్న కార్యక్రమం



న్యూ ఢిల్లీ, ఆగష్టు 20 (తీన్మార్ న్యూస్): రక్షణ మంత్రిత్వ శాఖ మొట్టమొదటిసారిగా యుద్ధం, యుద్ధం మరియు యుద్ధ పోరాటాలపై రణ్ సంవాద్- సంభాషణలు అనే త్రి-సేవల సెమినార్‌ను మోవ్ (డాక్టర్ అంబేద్కర్ నగర్) లోని ఆర్మీ వార్ కాలేజీలో నిర్వహిస్తోంది. ఈ నెల 26 నుండి 27 వరకు జరగనున్న ఈ సెమినార్, యుద్ధంపై సాంకేతికత ప్రభావంపై రెండు ఉప-ఇతివృత్తాలతో దృష్టి సారిస్తుంది. ఉద్భవిస్తున్న సాంకేతికతలు మరియు భవిష్యత్తు యుద్ధంపై ప్రభావం మరియు సాంకేతిక సామర్థ్యాన్ని ఉత్ప్రేరకపరచడానికి సంస్థాగత శిక్షణలో సంస్కరణలు. రెండు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, మాజీ సైనికులు, సేవలందిస్తున్న అధికారులు, రక్షణ నిపుణులు మరియు పరిశ్రమ ప్రతినిధులు ఒకచోట చేరి యుద్ధం యొక్క మారుతున్న స్వభావం మరియు కార్యాచరణ ప్రణాళిక, వ్యూహాలు మరియు వ్యూహాలపై దాని ప్రభావాల గురించి చర్చిస్తారు. ఈ వార్షిక సెమినార్ భారతదేశ రక్షణ రంగంలో వ్యూహాత్మక చర్చను సులభతరం చేయడం మరియు సంస్కరణలను నడిపించడం లక్ష్యంగా పెట్టుకుందని మంత్రిత్వ శాఖ తెలిపింది.

# సరిపడా యూరియా ఉంది

## సమయానికి ఫర్టిలైజర్ షాప్ లు తెరవాలి

## రైతులను ఇబ్బంది పెట్టొద్దు

## జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

జనగామ జిల్లా, ఆగస్టు 20 (తీన్మార్ న్యూస్): వానాకాలం పంటకు సరిపడ యూరియా ఉందని రైతులు ఆందోళన పడాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. బుధవారం నెల్లుట్ల, లింగాల ఘనపూర్ మండలంలోని ఆగ్రోస్ కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్టాక్ నిలవలను, రైతు వారీగా యూరియా కొనుగోలు వివరాలను పరిశీలించారు. ఎక్కువ రద్దీ కాకుండా ఉదయాన్నే షాప్ లను తెరవాలని రైతులను ఇబ్బంది పెట్టకుండా యూరియా అమ్మకం జరగాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో సరిపడా యూరియా ఎప్పటికప్పుడు సరఫర అవుతోందని రైతులు ఆందోళన చెందాలిసిన అవసరం లేదన్నారు. ఎవరైన కృత్రిమ కొరత సృష్టించాలని చేసిన, అధిక ధరలకు విక్రయించిన వారి పై చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ప్రతి ఎరువుల దుకాణంలో ఒక్కో రైతు వారీగా కొనుగోలు చేసిన వివరాలు రిజిస్టర్లు అప్డేట్ గా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అంబికా సోని, వారి సిబ్బంది పాల్గొన్నారు



# వైస్ కెప్టెన్‌గా శుభమన్‌గిల్

## సంజూశాంసన్ భవిష్యత్‌పై ప్రభావం






టీ-20 ప్రపంచ కప్ సంగ్రామానికి మరో ఆరు నెలలే సమయం. ఆలోగా ఆసియా కప్ బరిలో టీ-మ్ఇండియా జట్టు- ప్రకటన జరిగిపోయింది. కెప్టెన్ సూర్యకు డిప్యూటీగా శుభ్‌మన్ గిల్ వచ్చాడు. ఇప్పుడందరి మదిలో ఓ ప్రశ్న మొదలైంది. వైస్ కెప్టెన్‌గా గిల్ రాక.. సంజుశాంసన్ భవిష్యత్తుకు ఏమైనా సమస్యగా మారనుందా? పంత్ లేని లోటు-ను సంజు పూరిస్తాడా? ఇటీవలే టెస్టు జట్టు సారథిగా ఎంపికైన శుభ్‌మన్ గిల్ మొదటి సిరీస్‌లోనే అదరగొట్టాడు. అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. ఇప్పుడు పొట్టి ఫార్మాట్‌లోనూ అక్షర్ పటేల్‌ను కాదని గిల్‌కే వైస్ కెప్టెన్సీ అప్పగిస్తూ బీసీసీఐ సెలక్షన్ కమిటీ- నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే టెస్టు సారథిగా ఉన్న గిల్.. రాబోయే కాలంలో టీ-20, వన్డేలకూ నాయకత్వం వహించనున్నాడని క్రికెట్ వర్గాలు తెలిపాయి. వన్డే ప్రపంచకప్ 2027తోపాటు- లాస్ ఏంజెలెస్ వేదికగా 2028 ఒలింపిక్స్ బరిలోకి దిగే జట్టును నడిపించే అవకాశం ఉంది. ఇప్పుడిది ఓపెనర్, సీనియర్ ఆటగాడు సంజుశాంసన్‌కు కొత్త తలనొప్పి తీసుకొచ్చే అవకాశం లేకపోలేదు. ఆసియా కప్‌లో రాణించడంతోపాటు- ఇతర సమీకరణాలు కలిసి వస్తేనే 'వరల్డ్' కప్ జట్టులోనూ చోటు- దక్కేది. ఆసియా కప్ కోసం యశస్వి జైస్వాల్‌ను కాదని మరీ అభిషేక్ శర్మకు జోడీగా సంజును మేనేజ్‌మెంట్ తీసుకుంది. వికెట్ కీపర్ జాబితాలో ముందుంటాడు. రిషభ్ పంత్ గాయం కారణంగా టోర్నీకి అందుబాటు-లో లేకపోవడం సంజుకు కలిసొచ్చింది. కానీ, పొట్టికప్‌లో మాత్రం కచ్చితంగా అతడి నుంచి తీవ్ర పోటీ- తప్పదు. పంత్ దూకుడు మనందరికీ తెలిసిందే. ఇప్పటివరకు పొట్టి ఫార్మాట్‌లో పెద్దగా రాణించకపోయినప్పటికీ.. టీ-20 ప్రపంచకప్‌లో మాత్రం తొలుత ప్రాధాన్యం ఇచ్చేది పంత్‌కే. ఎడమ చేతివాటంతోపాటు- గత పొట్టికప్‌లో వన్‌డౌన్‌లో కొన్ని విలువైన ఇన్నింగ్స్‌లు ఆడాడు. ఇప్పుడు ఆసియాకప్‌లో గిల్ వన్‌డౌన్‌లో ఆడినా.. 2026 టీ-20 కప్‌లో మాత్రం ఓపెనర్‌గానే బరిలోకి దిగే అవకాశాలు మెండుగా ఉన్నాయి. అప్పుడు పంత్ మళ్లీ తన వన్‌డౌన్‌కే వస్తాడు. అయితే, ఇలాంటి క్లిష్ట సమయాల్లోనూ సంజుకు మరొక అవకాశం లేకపోలేదు. టీ-20ల్లో అద్భుతమైన రికార్డు ఉన్న సంజుశాంసన్ కొన్నాళ్లపాటు- ఫామ్ లేక ఇబ్బందిపడ్డాడు. గతేడాది చివరి నుంచి వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవడం ఇప్పుడు కలిసొచ్చింది. పొట్టి ఫార్మాట్‌లో వరుసగా రెండు సెంచరీలు బాదిన భారత క్రికెటర్‌గానూ రికార్డు సృష్టించాడు. ఇప్పుడు ఆసియా కప్‌లోనూ ఓపెనర్‌గా రాణిస్తే.. అతడిని పక్కనపెట్టడం మేనేజ్‌మెంట్‌కు సాధ్యపడదు. ఆసియా కప్‌తో పాటు- ఆరు నెలల వ్యవధిలో జరగబోయే టీ-20 సిరీసుల్లో ఏమాత్రం ప్రదర్శన సరిగా లేకపోయినా సంజు భవిష్యత్తు మరోసారి ప్రమాదంలో పడిపోవడం ఖాయం.

# ఆసియా కప్‌పై అనుమానాలొద్దు

### కేంద్రం ఆదేశాల మేరకే బిసిసిఐ వెళుతుంది

### క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్



ఆసియా కప్ కోసం టీమ్ఇండియా తన స్క్వాడ్‌ను ప్రకటించింది. పాకిస్థాన్ కూడా ఇప్పటికే జట్టును వెల్లడించిన సంగతి తెలిసిందే. అయితే, భారత్ - పాక్ మ్యాచ్ జరుగుతుందా? లేదా? అనేది ఇప్పటికీ అభిమానులకు అనుమానంగానే ఉంది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాక్‌తో క్రికెట్ సంబంధాలనూ తెంచుకోవాలనే డిమాండ్లూ వచ్చాయి. వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ లీగ్‌లో పాక్‌తో భారత ఛాంపియన్స్ ఆడలేదు. ఇప్పుడు ఆసియా కప్‌లో ఏ నిర్ణయం తీసుకుంటారనేది ఆసక్తికరంగా మారింది. అయితే ఇందులో ఏ సంశయం వద్దని.. కేంద్ర ప్రభుత్వం ఏం చెబితే దానిని బీసీసీఐ, టీమ్ఇండియా ఫాలో అవుతుందని క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ సూచించాడు. ఇలాంటప్పుడు ప్లేయర్లపై ఎవరూ విమర్శలు చేయొద్దని వ్యాఖ్యానించాడు. పాకిస్థాన్‌తో మ్యాచ్‌పై భారత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే.. దానిని అందరూ అనుసరించాలి. ఇందులో ఆటగాళ్లను విమర్శించకూడదు. బీసీసీఐ మాత్రం ప్రభుత్వం ఆదేశాలను పాటిస్తుంది. కాబట్టి, ఇదంతా కేంద్రంపై ఆధారపడి ఉంది. భారత ప్రభుత్వం నిర్ణయం మేరకే బీసీసీఐ ముందుకు వెళ్లాల్సిఉంటుందని గావస్కర్ స్పష్టంచేశాడు. ఆసియా కప్ కోసం ప్రకటించిన జట్టు- చాలా బాగుంది. లోతైన బ్యాటింగ్‌ను చూస్తే కుడి - ఎడమ కాంబినేషన్‌తో వైవిధ్యంగా ఉంది. ఇక సమతూకంతో ఎంపిక చేసిన బౌలింగ్ యూనిట్ కూడా సూపర్. ఇక శుభ్‌మన్ గిల్‌కు వైస్ కెప్టెన్ ఇవ్వడం మంచి నిర్ణయం. ఇప్పుడు ఉప సారథిగా నియమించడం వెనక పెద్ద ప్రణాళికే ఉంది. భవిష్యత్తులో టీ-20 సారథిగా ఎంపిక చేసే అవకాశం లేకపోలేదని గావస్కర్ వ్యాఖ్యానించాడు.

## శ్రేయస్కు చోటు దక్క పోవడం అన్యాయం : రాబిన్ ఊతప్ప



యూఏఈ వేదికగా సెప్టెంబర్ 9 నుంచి టీ-20 ఫార్మాట్లో ఆసియా కప్ జరగనుంది. దీనికి సంబంధించి బీసీసీఐ 15 మంది సభ్యులతో కూడిన భారత జట్టు-ను మంగళవారం ప్రకటించింది. ఈ నేపథ్యంలో స్క్వాడ్‌లో శ్రేయస్ అయ్యర్‌కు చోటు- కల్పించకపోవడం తనను ఆశ్చర్యానికి గురి చేసిందని టీమ్ఇండియా మాజీ క్రికెటర్ రాబిన్ ఉతప్ప అన్నాడు. అయితే 2026లో జరగనున్న టీ-20 వరల్డ్‌కప్‌లో మాత్రం శ్రేయస్‌ను కచ్చితంగా ఆడించాలని సూచించాడు. టీ-20 వరల్డ్ కప్ కంటే ముందు భారత్ 18 టీ-20 మ్యాచ్‌లు ఆడనుంది. టీ-మ్ఇండియా ఛాంపియన్స్ ట్రోఫీ గెలవడంలో కీలకపాత్ర వహించిన శ్రేయస్ అయ్యర్‌కు చోటు దక్కకపోవడం ఆశ్చర్యానికి గురిచేసింది. కానీ అతడు త్వరలోనే జట్టులో స్థానం సొంతం చేసుకుంటాడు. ఎందుకంటే అతడికి ఆ అర్హత ఉంది. శ్రేయస్ కచ్చితంగా వరల్డ్ కప్ ఆడే జట్టు-లో ఉండాలని రాబిన్ ఉతప్ప పేర్కొన్నాడు. అయితే శ్రేయస్ అయ్యర్‌కు జట్టులో స్థానం దక్కకపోవడంపై బీసీసీఐ చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ మాట్లాడాడు. 'దీనిలో శ్రేయస్ తప్పు కానీ.. మా తప్పు కానీ లేదు. ఎందుకంటే మేం కేవలం 15 మందిని మాత్రమే ఎంపిక చేయగలం. అతడు తన అవకాశం కోసం ఎదురుచూడక తప్పదు' అని అన్నాడు. అలాగే అభిషేక్ శర్మ ఆల్‌రౌండర్ నైపుణ్యం వల్ల యశస్వి జైస్వాల్‌ను కాదని అతణ్ని ఎంపిక చేశామని అగార్కర్ వివరించాడు. 2026లో జరగనున్న టీ-20 వరల్డ్ కప్ కంటే ముందు టీ-మ్ఇండియా.. ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, దక్షిణాఫ్రికాతో పొట్టిఫార్మాట్లో మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. శ్రేయస్ అయ్యర్ చివరిసారిగా టీ-మ్ఇండియా తరఫున డిసెంబర్ 2023లో ఆస్ట్రేలియాపై జరిగిన టీ-20 మ్యాచ్‌లో తలపడ్డాడు. ఆ మ్యాచ్‌లో అతడు హాఫ్ సెంచరీతో రాణించాడు. అప్పటి నుంచి అతడు టీ-20 జట్టు-కు ఎంపికవడం లేదు. దేశవాళీల్లో నిలకడగా రాణిస్తున్నప్పటికీ అతడికి అవకాశాలు రావడం లేదు.

# యశస్వి జైలస్వాల్‌కు చోటు దక్కక పోవడం ఆశ్చర్యకరం

## టీమిండియా స్పిన్నర్ అశ్విని రవిచంద్రన్





ఆసియా కప్ 2025 కోసం భారత టీ-20 జట్టు-ను ప్రకటించిన తర్వాత, సెలక్షన్ కమిటీ- నిర్ణయాలపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా, యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌ను జట్టులోకి ఎంపిక చేయకపోవడం టీమిండియా సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్‌కు ఆశ్చర్యకరంగా ఉందని.. నిరాశ కలిగించిందని పేర్కొన్నాడు. జైస్వాల్‌ను ఇలా పక్కన పెట్టడం అన్యాయంగా అభిప్రాయపడ్డాడు. అద్భుతంగా ప్రదర్శిస్తున్న ఆటగాడికి ఇలాంటి అన్యాయం జరిగితే ఆటతీరును దెబ్బతీసే ప్రమాదం ఉందని ఆయన తెలిపాడు. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ- శుభ్‌మన్ గిల్‌ను వైస్ కెప్టెన్‌గా తీసుకుని జట్టు-లోకి తీసుకోగా.. జైస్వాల్‌ను జట్టు- నుంచి తప్పించింది. ఈ నిర్ణయం పై అశ్విన్ తన యూట్యూబ్ ఛానెల్‌లో స్పందించారు. 'జట్టు- కోసం నిస్వార్థంగా ఆడే యువ ఆటగాడు జైస్వాల్. ఇలా తప్పించబడడం చాలా బాధాకరం. అతను తన వ్యక్తిగత రికార్డులను కంటే జట్టు-ను ముందుపెట్టే ఆటగాడు. ఇలాంటి నిర్ణయం వల్ల అతను జట్టు-కు కాకుండా.. తన వ్యక్తిగత విజయాల కోసం ఆడే పరిస్థితి వచ్చే ప్రమాదం ఉంది' అంటూ ఆందోళన వ్యక్తం చేశాడు. జైస్వాల్ ప్రదర్శనను గురించి మాట్లాడే సమయంలో -టె-స్టు క్రికెట్‌లో అవకాశం ఇచ్చిన వెంటనే తన ప్రతిభను అందిపుచ్చుకున్నాడు. ఇటీ-వల భారత -టె-స్ట్ బ్యాటర్లలో అతను అత్యంత విజయవంతంగా నిలిచాడు. ఏ ఫార్మాట్‌లో అవకాశం ఇచ్చినా, అతను జట్టు-కు అత్యుత్తమంగా రాణించాడు. ఇంత మంచి ఆటగాడికి జట్టు-లో చోటు- ఇవ్వకపోవడం అర్థం కావడం లేదని అశ్విన్ పేర్కొన్నారు. టీ-20 ఫార్మాట్‌లో జైస్వాల్ 165 స్ట్రయిక్ రేట్‌తో ఆడుతున్నాడని, ఎప్పటికప్పుడు జట్టు-కు ప్రాధాన్యత ఇస్తున్నాడని అశ్విన్ చెప్పాడు. జైస్వాల్ వంటి ఆటగాళ్లు దొరకడం చాలా కష్టమైన విషయం. బంతిని బాదాల్సినప్పుడే కాదు.. కష్టం వచ్చినప్పుడు కూడా శక్తితో ఆడేందుకు ప్రయత్నిస్తాడని.. అలాంటి ఆటగాళ్లను ప్రోత్సహించడం కంటే, ఇలా పక్కన పెట్టడం అసంబద్ధమని అశ్విన్ పేర్కొన్నారు. ఈ నిర్ణయం వల్ల జైస్వాల్ మళ్లీ తన కెరీర్‌ను మొదటి నుంచి పునరుద్ధరించుకోవాల్సి వచ్చే పరిస్థితి వచ్చిందని అశ్విన్ చెప్పుకొచ్చాడు. గిల్‌ను వైస్ కెప్టెన్‌గా నియమించడం ప్రస్తుత టోర్నీ కోసమే కాకుండా.. భవిష్యత్ కెప్టెన్సీని దృష్టిలో పెట్టు-కొని తీసుకున్న నిర్ణయంగా అశ్విన్ చెప్పుకొచ్చాడు. సెలక్టర్లు శుభ్‌మాన్ గిల్‌ను భవిష్యత్ కెప్టెన్‌గా పరిగణించే అవకాశం ఉందని.. బహుశా అన్ని ఫార్మాట్‌లకు కెప్టెన్‌గా కనిపించొచ్చని.. అయితే, ప్రతి ఫార్మాట్‌లో ఒకే ఒక కెప్టెన్ ఉండాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఈ నిర్ణయం వికెట్ కీపర్-బ్యాట్స్‌మన్ సంజు సామ్సన్‌పై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతుందని అశ్విన్ తెలిపాడు. అత్యంత విచారకరమైన విషయం ఏమిటంటే గిల్‌ను వైస్ కెప్టెన్‌గా నియమించిన వెంటనే, సామ్సన్ స్థానానికి ముప్పు ఏర్పడిందని.. దీని అర్థం సంజు సామ్సన్ ఆడకపోవచ్చని.. శుభ్‌మాన్ గిల్ ఖచ్చితంగా ఆడుతాడని, ఓపెనర్‌గా వస్తాడని పేర్కొన్నారు. శామ్సన్ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడని.. గతేడాది టీ-20ల్లో మూడు సెంచరీలు చేశాడని గుర్తు చేశాడు.

# యజ్వేంద్ర చాహల్‌తో విడాకులపై స్పందించిన ధనశ్రీవర్మ..!




టీమిండియా క్రికెటర్ యజ్వేంద్ర చాహల్‌తో విడాకులపై ఆయన మాజీ భార్య, ప్రముఖ కొరియోగ్రాఫర్ ధనశ్రీ వర్మ తొలిసారిగా స్పందించారు. విడాకుల సమయంలో కోర్టులో ఎదుర్కొన్న మానసిక వేదనను, ఆ తర్వాత జరిగిన టీ-షర్ట్ వివాదాన్ని ఓ పాడ్‌కాస్ట్‌లో పంచుకున్నారు. కోర్టులో తీర్పు వెలువరించే సమయంలో ఆమె తన భావోద్వేగాలను కంట్రోల్ చేయలేక, అందరితో కలిసి కన్నీళ్లు పెట్టుకున్నట్లు ఆమె తెలిపారు. మంగళవారం 'హ్యూమన్స్ ఆఫ్ బాంబే' పాడ్‌కాస్ట్‌లో ధనశ్రీ మాట్లాడింది. 'విడాకుల రోజున మేమిద్దరం కూడా మానసికంగా సిద్ధమయ్యే ప్రయత్నం చేసాం. కానీ, తీర్పు ఇవ్వబోతున్నప్పుడు, నా భావోద్వేగాలను అదుపు చేయలేకపోయాను. ఆ క్షణంలో నేను ఎంత బాధపడుతానో చెప్పలేక ఒక రకంగా ఏడ్చేశాను. ఆ తర్వాత చాహల్ అక్కడి నుంచి బయటకు వెళ్లిపోయారు' అని చెప్పింది. విడాకుల సమయంలో చాహల్ ధరించిన 'బీ యువర్ ఓన్ షుగర్ డాడీ' అని రాసి ఉన్న టీ-షర్ట్ పెద్ద వివాదాన్ని రేపింది. దీనిపై ధనశ్రీ స్పందిస్తూ 'ఈ విషయంలో ప్రజలు నన్నే నిందిస్తారని మేం ముందే ఊహించాం. టీ-షర్ట్ గురించి తెలిసేలోపే.. నాపై నిందలు మోపుతారనే అభిప్రాయం ఏర్పడింది' అని తెలిపింది. కోర్టు నుంచి బయటకు వచ్చిన తర్వాత చాహల్ టీ-షర్ట్‌కి సంబంధించిన వీడియోలను చూసి ఆమె ఆశ్చర్యపోయానని చెబుతూ.. 'అరే, వాట్సాప్‌లో చెప్పొచ్చు కదా! అలా ఎందుకు వేసుకున్నాడో?' అని ఆమె వ్యాఖ్యానించారు. ఇలాంటి సున్నితమైన విషయాలను ఎంతో పరిపక్వతతో చూసుకోవాలని భావించానని అన్నారు. 'ప్రజలను ఆకట్టుకోవడం కోసం అనాలోచిత వ్యాఖ్యలు చేయడం నాకు ఇష్టం లేదు. మా కుటుంబ విలువలను, అతని కుటుంబ గౌరవాన్ని కాపాడాలనే భావనతోనే అలా స్పందించాను' అని పేర్కొన్నారు. సమాజంలో మహిళల పరిస్థితిని వివరిస్తూ 'మహిళగా, బంధాన్ని నిలబెట్టుకోవాలని, అన్నింటినీ మినహాయించుకొని జీవనం సాగించాలని మనం నేర్చుకుంటాం. మన తల్లులు ఎంతో గౌరవంగా ఆ మాటలు చెప్పినట్లయితే, అది నిజమే' అని తెలిపారు. పెళ్లి బంధంలో ఉన్నప్పుడు, తన భర్త చాహల్‌కు తాను అండగా నిలిచానని, చిన్న చిన్న విషయాల నుంచి పెద్ద విషయాల వరకు అతనితో అంగీకారంగా ఉంటూ ఎప్పుడూ కృషి చేశానని ధనశ్రీ గుర్తు చేసుకున్నారు. చాహల్, ధనశ్రీ వర్మ 2020లో వివాహం చేసుకున్న తర్వాత ఐదేళ్ల వివాహ బంధం ముగియడంతో ఈ విడాకులు తీసుకున్న విషయం ఇటీవల వార్తల్లో నిలిచింది.

# బాహుబలి రీరిలీజ్ కోసం ఎదురుచూపు



భారతీయ సినీ చరిత్రలో సెన్సేషన్ సృష్టించిన సినిమా 'బాహుబలి'. ఇప్పటికీ ఆ మ్యాజిక్, ఆ ఎమోషన్ ఎక్కడ తగ్గలేదు. ఇప్పుడు అదే బాహుబలి సరికొత్త రూపంలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. రెండు భాగాలను కలిపి, కొత్త సన్నివేశాలు జోడించి రూపొందించిన ఈ స్పెషల్ వెర్షన్‌కు పేరు - 'బాహుబలి ది ఎపిక్'. అక్టోబర్ 31న గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానున్న ఈ సినిమాపై, అంచనాలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ప్రభాస్, రానాలతో ఇప్పటికే ఒక స్పెషల్ ఇంటర్వ్యూ కూడా షూట్ చేసినట్లు- టాక్ ఉంది. అనుష్క కూడా పాల్గొనబోతుందన్న వార్తలు వినిపిస్తున్న, ఆ విషయాన్ని టీమ్ కన్ఫర్మ్ చేయలేదు. కానీ ప్రస్తుతం అనుష్క హైదరాబాద్‌లో ఉన్నందున సెప్టెంబర్‌లో జరిగే ఈవెంట్స్‌లో ఆమె పాల్గొనడం ఖాయమనే అంచనాలు ఉన్నాయి. వీరితో పాటుగా రమ్యకృష్ణ, తమన్నా, సత్యరాజ్, సుదీప్, నాజర్ తదితర తారలతో కూడా వరుస స్పెషల్ ఈవెంట్లు-, ఇంటర్వ్యూలు ఎ÷-లాన్ చేస్తున్నట్లు- సమాచారం. ఈ మొత్తం షెడ్యూల్‌ను కార్తికేయ పర్యవేక్షణలో సిద్ధం చేసారని తెలుస్తోంది. ఇక ఈ బాహుబలి ఎపిక్ రిలీజ్ కోసం అభిమానుల్లో క్రేజ్ రోజురోజుకీ పెరుగుతోంది. సహజంగానే దీనికి భారీ ఓపెనింగ్స్ ఖాయమని టాక్ వినిపిస్తోంది. జక్కన్న రాజమౌళి ప్రస్తుతం మహేష్ బాబు సినిమా షూట్‌తో బిజీగా ఉన్నప్పటికీ, అక్టోబర్ రెండో వారం నుంచి పూర్తిగా బాహుబలి ప్రమోషన్లపై దృష్టి సారించనున్నాడు. ఇక నిర్మాత శోభు యార్లగడ్డ వరల్డ్ వైడ్ రిలీజ్ కోసం గ్రాండ్‌గా ఎ÷-లాన్స్ చేస్తున్నారట. ప్రీమియర్లతో మొదలయ్యే ఈ వేడుకలు అంతర్జాతీయ స్థాయిలో జరుగనున్నాయి. ఒకవేళ ఈ 'సింగిల్ పార్ట్ ఎపిక్ ఫార్ములా' సక్సెస్ అయితే, భవిష్యత్తులో పుష్ప, కెజిఎఫ్ వంటి బ్లాక్‌బస్టర్లు కూడా ఇదే రూట్ ఫాలో అయ్యే ఛాన్స్ ఉంది.

# హరిహరవీరమల్లు ఓటీటీలో క్లైమాక్స్‌లో కట్స్



పవన్ కల్యాణ్ తొలి పాన్ ఇండియా సినిమా 'హరి హర వీరమల్లు' ఓటీటీ ప్రేక్షకుల ముందుకు వచ్చేసింది. క్రిష్, జ్యోతికృష్ణ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం అమెజాన్ ప్రైమ్ వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది. అయితే, ఈ సినిమా థియేటర్ వెర్షన్‌లో కొన్ని మార్పులు చేసి ఓటీటీలోకి అందుబాటులోకి తెచ్చారు. థియేటర్‌లో ఈ సినిమా విడుదలైనప్పుడు ఇందులోని కొన్ని సన్నివేశాలపై విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే. కొన్ని సీన్స్‌లోని వీఎఫ్‌ఎక్స్ విషయంలో మరింత శ్రద్ధ వహించాల్సిందని కామెంట్స్ వినిపించాయి. ఇప్పుడు ఆ సన్నివేశాలను ఓటీటీ- వెర్షన్‌లో తొలగించినట్లు- సమాచారం. ముఖ్యంగా గుర్రపు స్వారీ సన్నివేశం, పవన్ కల్యాణ్ బాణం గురిపెట్టే సీన్స్‌ను థియేటర్లో విడుదలైన తర్వాత మార్పులు చేశారు. అయితే ఓటీటీలో ఈ సన్నివేశాలను పూర్తిగా కట్ చేశారని నెటిజన్లు పేర్కొంటున్నారు. క్లైమాక్స్‌లోనూ కొన్ని మార్పులు చేసినట్లు- తెలుస్తోంది. అసుర హననం పాట తర్వాత పార్ట్2 ప్రకటనతో సినిమాను పూర్తి చేశారట. -క్లైమాక్స్‌లో వచ్చే బాబీదేవోల్ సంభాషణలు, కొన్ని యాక్షన్ సన్నివేశాలను కూడా తొలగించారట. మొత్తం మీద చిత్రబృందం దాదాపు 15 నిమిషాల ఫుటేజ్‌ను కట్ చేసి ఓటీటీలో విడుదల చేసినట్లు- తెలుస్తోంది. జులై 24న పాన్ ఇండియా స్థాయిలో విడుదలైన ఈ మూవీ వన్‌మ్యాన్ షోగా పవన్ అభిమానులను ఆకట్టుకుంది. అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ మూవీని రెండు భాగాలుగా తెరకెక్కించారు.





# డైరెక్టర్ గా షాక్ ఇచ్చిన చిరుత పిల్ల!

ఓడలు బళ్లు అవుతాయి. బళ్లు ఓడలవుతాయంటారు. తాజాగా ఈ మాట మరోసారి నిజం చేసేలా ఉంది ముంబై బ్యూటీ నేహాశర్మ. ఈ బ్యూటీ టాలీవుడ్ కి %-%చిరుత%-% సినిమాతో ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. తొలి సినిమాతోనే గ్రాండ్ హిట్ అందుకుంది. కానీ ఆసక్సెస్ ని కంటున్యూ చేస్తూ తెలుగులో అవకాశాలు అందుకోవడంలో విఫలమైంది. రెండు..మూడు తెలుగు సినిమాలతోనే బాలీవుడ్ కి పరిమితమైంది. కెరీర్ ఆరంభంలోనే హిందీ అవకాశాలతో బిజీ అయింది. కానీ నటిగా మాత్రం రావాల్సినంత గుర్తింపు రాలేదు. ఖాళీగా లేకుండా దశాబ్దం పాటు ప్రయాణాన్ని కొనసాగించింది గానీ ఇండస్ట్రీలో నటిగా తన మార్క్ మాత్రం వేయలేకపోయింది. సినిమా ల్లో నటికంటే? సోషల్ మీడియాలో చిట్టిపొట్టి దుస్తుల్లోనే ఎక్కువగా ఫేమస్ అయింది. ఇన్ స్టా వేదికగా అమ్మడు చేసే అందాల రచ్చ అంతా ఇంతా కాదు. తాజాగా ఈ బ్యూటీ దర్శకురాలిగా కొత్త ప్రయాణానికి రెడీ అవుతోంది. అదీ ఆషామాషీ చిత్రం కాదు. ఏకంగా ఓ భారీ యాక్షన్ చిత్రానికే సంకల్పించింది. ఇందులో సిద్ధాంత్ చతుర్వేది, మోహిత్ కీలక పాత్రలు పో షిస్తున్నారు. 1985 నేపథ్యంలో సాగే పిరియాడిక్ చిత్రమిది. ఈ చిత్రాన్ని నిర్మిస్తుంది చిన్న చితాకా హీరో కాదు. నేహాశర్మ ట్యాలెంట్ ను నమ్మి ఏకంగా బాలీవుడ్ స్టార్ అజయ్ దేవగణ్ కోట్ల రూపాయలు ఖర్చు చేయడానికి రెడీ అవుతున్నారు. ఆయన సొంత నిర్మాణ సంస్థలోనే ఈ చిత్రం నిర్మాణం కానుంది. దీంతో నేహా శర్మ పేరు మరోసారి నెట్టింట హాట్ టాపిక్ గా మారింది. అమ్మడిలో క్రియేటివ్ యాంగిల్ కూడా ఉందా? అని చర్చించుకుంటున్నారు. ఏ పుట్టలో ఏ పాముందో ఎవరికి ఎరుక? అన్నట్లు ఎవరి ట్యాలెంట్ ఎంత? అన్నది ముందే అంచనా వేయ లేం. నటిగా ఫేం సాధించలేని బ్యూటీ దర్శకురాలిగా సక్సెస్ అయితే? ఆమె జాతకమే మారిపోతుంది. అసలే బాలీవుడ్ లో లేడీ డైరెక్టర్లు చాలా తక్కువ. క్రియేటివ్ రంగంలో మహిళలు కూడా రాణించాలని మేథా వర్గం కోరుకుంటోన్న నేపథ్యంలో? నేహా శర్మ కెప్టెన్ కుర్చీ ఎక్కడం ఇప్పుడో సంచలనం.

## మంచి లవ్ స్టోరీ కోసం మోక్షజ్ఞ చూపు

### బాలయ్య వారసుడి ఎంట్రీపై నారా రోహిత్

నందమూరి అభిమానులతో పాటు- సినీ ప్రియులంతా బాల్య నటవారసుడు మోక్షజ్ఞ ఎంట్రీ కోసం ఎదురుచూస్తున్నారు. తాజాగా మోక్షజ్ఞ లుక్ కూడా ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీనిపై నటుడు నారా రోహిత్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఇండస్ట్రీక్రి వచ్చేందుకు ఈ నందమూరి వారసుడు చాలా ఆసక్తిగా ఉన్నాడని తెలిపారు. ఇటీవల మోక్షజ్ఞతో మాట్లాడినప్పుడు కూడా స్క్రిప్ట్ కోసం చూస్తున్నట్లు- చెప్పాడు. ఈ ఏడాది చివర్లో, లేదంటే వచ్చే సంవత్సరం ప్రారంభంలో అతని ఎంట్రీ ఉండే అవకాశం ఉంది. ఇండస్ట్రీక్రి రావడం కోసం అతడు కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నాడు. సినిమాల కోసమే లుక్ మార్చుకున్నాడు. గతంలో లుక్ కంటే ఇప్పుడు చాలా మార్పు వచ్చింది. ఫీల్‌గుడ్ లవ్‌స్టోరీ కోసం వెతుకుతున్నట్లు- ఈ మధ్య కలిసినప్పుడు చెప్పాడు. అలాంటి కథ ఉంటే ఈ ఏడాదిలోనే ఎంట్రీ- ఉండే అవకాశం ఉందని నారా రోహిత్ తెలిపారు. బాలకృష్ణతో తన మల్టీ స్టారర్‌పై నారా రోహిత్ స్పందించారు. గతంలో స్క్రిప్ట్ రెడీ చేసినట్లు- చెప్పారు. కథ రెడీ చేశారు. మా ఇద్దరికీ లుక్ టెస్ట్ కూడా చేశారు. కథ నచ్చింది. కానీ, ఆ సమయంలో ఆయనకు వరుస సినిమాలు, ఎలక్షన్స్ ఉండడంతో అది పట్టాలెక్కలేదు. బాలయ్య నటించిన మరో సినిమాలోనూ నేను అతిథి పాత్రలో చేయాల్సిఉంది. కానీ, అది కూడా కొన్ని కారణాల వల్ల కుదర్లేదు. ఆ సినిమా స్థానంలోనే ఆయన 'లెజెండ్' చేశారు. భవిష్యత్తులో బాలయ్యతో కలిసి నటించే అవకాశం వస్తే కచ్చితంగా చేస్తాను. ఆ రోజు కోసమే ఎదురుచూస్తున్నా అని నారా రోహిత్ చెప్పారు. ప్రస్తుతం నారా రోహిత్ నటించిన 'సుందరకాండ' విడుదలకు సిద్ధంగా ఉంది. ఆయన కథానాయకుడిగా కొత్త దర్శకుడు వెంకటేశ్ నిమ్మలపూడి తెరకెక్కించిన చిత్రమిది. శ్రీదేవి విజయ్‌కుమార్, వృతి వాఘని కథానాయికలు. ఈనెల 27న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది.



# సోషల్ మీడియా కామెంట్స్ పట్టించుకోను

## పరదా విజయం సాధిస్తుందన్న నమ్మకం ఉంది

సోషల్ మీడియాలో వచ్చే కామెంట్స్‌ను పట్టించుకోవడం మానేసినట్లు నటి అనుపమ పరమేశ్వరన్ కుండబద్దలు కొట్టారు. సోషల్ మీడియాలో వచ్చే కామెంట్స్‌ను పట్టించుకోను. నేను పరదా పోస్టర్స్ షేర్ చేసినప్పుడు కూడా కొందరు దీనికి నెగెటివ్ కామెంట్స్ పెట్టారు. 'అట్టర్ ఫ్లాప్ అవుతుంది' అన్నారు. ఆ వ్యాఖ్యలు మా సినిమాను నిర్ణయించలేవు. ఒకవేళ నిజంగానే ఇది ప్రేక్షకాదరణ పొందలేకపోయినా.. నేను ఒక మంచి సినిమా తీశాననే సంతృప్తి నాకు జీవితమంతా ఉంటుంది. ఆమె ప్రధాన పాత్రలో ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వం వహించిన 'పరదా' ఆగస్టు 22న విడుదలకు సిద్ధమైంది. దీని ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో తన కెరీర్‌కు సంబంధించిన ఆసక్తికర విషయాలను ఆమె పంచుకున్నారు. కెరీర్ ప్రారంభించిన తొలినాళ్లలో ఇలాంటి కామెంట్స్ విని బాధ పడేదాన్ని. అనుభవం వచ్చే కొద్దీ ఇవి చాలా చిన్న విషయాలుగా కనిపిస్తాయి. గతంలో ప్రతి పోస్ట్‌కు వచ్చిన కామెంట్స్ అన్నీ చదివేదాన్ని. ఇప్పుడు నేను చెప్పాలనుకున్న విషయం చెప్పేసి వదిలేస్తున్నా. ఎవరెన్ని మాటలన్నా మనం జీవితంలో ముందుకు వెళ్లాల్సిందే అని అర్థం చేసుకున్నప్పుడు ఇవి చాలా చిన్న విషయాలుగా కనిపిస్తాయన్నారు. టిల్లు స్క్వేర్ తర్వాత నేను మాట్లాడే విధానంలోనూ మార్పు వచ్చింది. ఆ సినిమా విడుదలకు ముందు నాపై చాలా నెగెటివిటీ- వచ్చింది. రిలీజ్ అయ్యాక ప్రశంసలు వచ్చాయి. -ట్రైలర్ విడుదలయ్యాక నెగెటివిటీ- వస్తుందని తెలిసే ఆ పాత్రను ఎంపిక చేసుకున్నాను. అలాంటి రోల్స్‌ను అంగీకరించడమే ఒక సవాలు. వాటిని ఓకే చేయాలంటే ధైర్యం కావాలి. ఆ సినిమా ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూల్లో ఎన్నో ఇబ్బందికర మైన ప్రశ్నలు అడిగారు. అలాంటి ప్రశ్నలు కేవలం మహిళలనే అడుగుతారు. హీరోలను ఎందుకు అడగరు?. వాళ్లకు వ్యూస్ రావడం కోసమే అలా ఇబ్బందికరమైన ప్రశ్నలు అడుగుతారు. వాటికి సమాధానాలు చెప్పలేకపోయానని తెలిపారు.

Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463